Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక


Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

బుధవారం WEDNESDAY || 20.05.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 245 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah




## రష్యా అధ్యక్షుడు పుతిన్

# భారత పర్యటన ఖరారు..



**న్యూఢిల్లీ, మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమవేశం–2026 లో పాల్గొనేందుకు పుతిన్ భారతదేశం వస్తున్నారని రష్యా ప్రభుత్వ ప్రధాన కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరి ఉషకోవ్ మంగళవారంనాడు తెలిపారు. ఏడాది వ్యవధిలోనే పుతిన్ భారతదేశంలో పర్యటించనుండటం ఇది రెండోసారి అవుతుంది. 2025 డిసెంబర్‌లో ఆయన న్యూఢిల్లీలో పర్యటించారు. 23వ ఇండియా-రష్యా వార్షిక సదస్సులో పాల్గొన్నారు. పుతిన్ పర్యటనతో ఇరుదేశాల రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారు. చివరిసారిగా బ్రిక్స్ నేతలు బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో గత ఏడాది జూలైలో జరిగిన 17వ బ్రిక్స్ సదస్సులో పాల్గొన్నారు. భారతదేశం ఈ ఏడాది బ్రిక్స్ కూటమి అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. ఈ నెల ప్రారంభంలో రష్యా విదేశాంగ మంత్రి సర్జె లావ్రోవ్ భారతదేశంలో పర్యటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కీలక చర్చలు జరిపారు. ప్రపంచ వేదికపై గ్లోబల్ సౌత్ వాణిని బలోపేతం చేయడానికి బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికాతో కూడిన అంతర్జాతీయ కూటమిగా బ్రిక్స్ ఏర్పాటైంది. కూటమి విస్తరణలో భాగంగా ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ కూడా చేరాయి. దీంతో మొత్తం సభ్యుల సంఖ్య 11కు చేరింది.

## 23న యాదగిరిగుట్టలో

# కేబినెట్ సమావేశం..?

**హైదరాబాద్, మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ (కేబినెట్) సమావేశం నిర్వహణపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, ఈ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల 21వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో 'సరస్వతి అంత్య పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఈ చారిత్రాత్మక ఆధ్యాత్మిక వేడుకకు రాష్ట్రంలోని మెజార్టీ మంత్రులు హాజరుకానున్నారు. మంత్రులలంతా పుష్కరాల పనుల్లో నిమగ్న మవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, ఈసారి ఒక వినూత్నమైన నిర్ణయం తీసుకోబోతున్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరు గుతోంది. ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట (యాదాద్రి)లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నారు. పాలనా వికేంద్రీకరణతో పాటు ప్రాంతీయ ప్రాధాన్యతలను గుర్తించేలా రాజధాని హైదరాబాద్ వెలుపల కేబినెట్ భేటీలు నిర్వహించడం సీఎం రేవంత్ రెడ్డికి ఇది కొత్తేమీ కాదు.



గతంలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా మేడారంలో కేబినెట్ సమావేశా న్ని నిర్వహించి, అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, నిధులపై కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు యాదగిరిగుట్టలో మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించి, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి, స్థానిక అంశాలపై కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## బండి బగీరథ్ కేసు..

# మరో సిట్ ఏర్పాటు

**- బండి బగీరథ్ బెయిల్ కేసును విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి- ఆమెను లక్ష్యం చేసుకుని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు**

**- తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు**

**హైదరాబాద్,మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేస్తుందని, న్యాయవ్యవస్థపై జరిగిన ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి వద్దకు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ వేదికగా ఆమెను లక్ష్యంగా చేసుకుని కొన్ని అనుచిత పోస్టులను సర్క్యులేట్ చేశారు. బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా జస్టిస్ మాధవి దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారం న్యాయవ్యవస్థ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచా రంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం విచారణ జరిపే న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఇలాంటి పోస్టులు పెట్టడంపై దిగ్భ్రాంతి వ్యక్తమైంది. దీనిపై తెలంగాణ



న్యాయమూర్తుల సంఘం నేతలు కూడా తీవ్రంగా స్పందించారు. ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సోషల్ మీడియా దాడికి సంబంధించి ఇప్పటికే ప్రధాన నిందితుడైన దామోదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదు చేశారు. జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ఈ పోస్టుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, ఏ ఐటీ సెల్స్ దీనిని వ్యాప్తి చేశాయనే కోణంలో లోతైన దర్యాప్తు ప్రారంభించింది.

## రాష్ట్రంలోని అన్నదాతలకు గుడ్‌న్యూస్..

# 50 శాతం రాయితీ తో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

### 'రైతునేస్తం' కార్యక్రమంలో మంత్రి తుమ్మల




**హైదరాబాద్, మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 'రైతునేస్తం' కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో ఇవాళ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుమాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేందుకు గాను పచ్చిరొ ట్ట, జీలుగ, జనుము, పిల్లపెసర విత్తనాలను 50 శాతం భారీ రాయితీ తో అందిస్తున్నామని ప్రకటించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రైతులు యూరి యా వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పంటలను ఎక్కువగా సాగు చేయాలన్నారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా భూమిని కాపాడుకుంటూనే అధిక దిగుబడులు సాధించాలి మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. నిస్సారంగామారిన నల్లబీడు భూములను తిరిగి సాగు లోకి తెచ్చేందుకు, వాటి పునరుద్ధరణకు రైతులు జిప్సం ను వినియోగిం చాలని మంత్రి తుమ్మల సూచించారు. అదేవిధంగా సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు అన్నదాతలు దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు.

## వాహనదారులకు షాక్..

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

**మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** వాహనదారులకు మళ్లీ షాక్.. దేశవ్యాప్తంగా మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 90 పైసల చొప్పున రేట్లను పెంచింది. కాగా, ఇంధన ధరల పెంపు వారం రోజుల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవల లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3వరకు పెంచిన సంగతి తెలిసిందే. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.98.64, డీజిల్ ధర రూ.91.58కు చేరింది. శుక్రవారం నాడే కేంద్ర ప్రభుత్వం లీటర్‌కు రూ.3 చొప్పున పెంచింది. దీంతో పెట్రోల్ రూ.94.77 నుంచి రూ.97.77, డీజిల్ రూ.87.67 నుంచి రూ.90.67కు పెరిగింది. తాజా పెంపుతో ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.59, డీజిల్ రూ.94.08కు పెరిగింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.109.70, డీజిల్ రూ.96.07కు చేరింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.104.49, డీజిల్ రూ.96.11కు పెరిగింది. కోల్‌కతాలో పెట్రోల్‌పై అత్యధికంగా 96 పైసల పెంపు నమోదైంది. దాని తర్వాత ముంబైలో పెట్రోల్‌పై 91 పైసలు, డీజిల్‌పై 94 పైసలు పెరిగింది. చెన్నైలో పెట్రోల్‌పై 82 పైసలు, డీజిల్‌పై 86 పైసలు పెరిగాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలోనే దేశీయంగా ఇంధన ధరలు మరింత పెరిగే అవకావం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# ఆర్థిక తుఫాన్ రాబోతోంది..

## రాహుల్ సంచలన వ్యాఖ్యలు



**రాయబరేలి మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** ఐదు రోజుల్లో రెండు సార్లు ఇంధనం ధరలు పెరగడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్వరలో ఆర్థిక తుఫాన్ రాబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సృష్టించిన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలనుందని, సాధారణ ప్రజానీకంపై ఇది పెనుభారం కానుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో రెండ్రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ, బిలియనీర్లు, పారిశ్రామికవేత్తల కోసం ప్రభుత్వ ఆర్థిక విధానాల రూపకల్పన జరిగిందన్నారు. ఇది పూర్తిగా కుప్పకూలనుందని చెప్పారు. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపై ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. అయితే ఈ ప్రభావం అదానీ, అంబానీ, మోదీలపై ఏమాత్రం ఉండదన్నారు. మునుముందు అంతా ఇక గడ్డుకాలమేనని చెప్పారు. ఆర్థిక సంక్షోభ నివారణకు కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి బదులు విదేశాలకు వెళ్లొద్దని మోదీ చెబుతున్నారని, ఆయన మాత్రం ప్రపంచమంతా తిరుగుతుంటారని విమర్శించారు. 'బిలియనీర్ల కోసం మోదీ ఆర్థిక వ్యవస్థను తారుమారు చేశారు. గత కొన్ని రోజులుగా ఈ విషయమే ప్రజలకు నేను వివరిస్తున్నాను. ఇప్పుడు ఆర్థిక సంక్షోభం విరుచుకుపడనుంది. ఇందువల్ల కీలక పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలపై ఎలాంటి ప్రభావం ఉండదు. వాళ్లు హాయిగా తామున్న చోటే ఉంటారు. కానీ యూపీలోని యువకులు, ప్రజలపై ఈ ఆర్థిక తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది' అని రాహుల్ అన్నారు.

# విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు : స్టాలిన్



**తమిళనాడు మే, 19 (సూర్యసేన ప్రతినిధి):** ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ,సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ,కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు.

# జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం






**– పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలి --**
**జిల్లా ఎస్పీ ఆదేశం**

**నల్గొండ, మే 19 (సూర్య సేన) :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విదంగా సమర్ధవంతగా పని చేయాలనీ జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన పోక్సో, గ్రేవ్, నాన్–గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, పెండింగ్ కేసుల స్థితి, కోర్టు విచారణలు, నేరస్తులకు శిక్షలు పడేలా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ యూఐ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు అధికారులతో సమన్వయం చేస్తుకుంటూ సీసీ నంబర్లు పెండింగ్, వారెంట్ల అమలు, పెండింగ్ సమన్ల తక్షణ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎన్ డి పి ఎస్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విదంగా పనిచేయాలని, మాదకద్రవ్యాల సరఫరా, రవాణా, వినియోగంపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు, ప్రమాదకర కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత ముమ్మరం చేయడంతో పాటు హెల్మెట్, సీట్ బెల్ట్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

దొంగతనాలు, చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల నివారణకు రాత్రి, పగలు గస్తీలు నిర్వహించాలని, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు స్వాధీనం చేసిన ఆస్తులను త్వరితగతిన అందజేయాలని సూచించారు. డయల్–100కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి తక్షణమే చేరుకోవాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కేసును బాధ్యతగా విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాంక్ మోసాలు, ఓటిపి మోసాలు, ఫేక్ లింకులు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లపై గ్రామ స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచేలా ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటి ద్వారా కేసుల ఛేదన వేగవంతం అవుతుందని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తికి సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పోలీసులు పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

జిల్లాలో నేర నియంత్రణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భద్రత అంశాల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ క్రైమ్ డిఎస్పీ లక్ష్మినారాయణ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ విస్తృత తనిఖీలు....







నల్లగొండ, మే 19 (సూర్య సేన): ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలులో భాగంగా నల్లగొండ పట్టణంలో మంగళవారం విస్తృత స్థాయిలో "ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్" (ఎఫ్ ఎస్ డబ్ల్యూ) తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివ శంకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌డబ్ల్యూ టెక్నీషియన్ ఎం. వెంకటపతి, డ్రైవర్ పి. వంశీ పాల్గొన్నారు. ఆర్‌పీ రోడ్, డీఈఓ కార్యాలయం పరిసరాలు, డీవీకే రోడ్, సాగర్ రోడ్ ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, పండ్ల వ్యాపారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు, టీ స్టాల్స్, కేఫేలు, మండీలలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యాపారులు చికెన్, మటన్ వంటి మాంసాహార పదార్థాలను సరైన లేబులింగ్ లేకుండా, "యూజ్ బై డేట్" నమోదు చేయకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసినట్లు గుర్తించారు. శీతలీకరణ ఉష్ణోగ్రతల నిర్వహణకు సంబంధించిన లాగ్ బుక్స్ కూడా లేకపోవడం గమనించారు. కొన్ని మాంసాహార పదార్థాలు పూర్తిగా పాడైపోయిన స్థితిలో కనిపించాయి. బేకరీలలో గడువు ముగిసిన బిస్కెట్లు, చాక్లెట్లు, సాస్‌లు ఇతర ఆహార పదార్థాలతో కలిపి నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహార భద్రత నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఈ పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేశారు. డీవీకే రోడ్డులోని ఒక కేఫేలో టీ తయారీలో రంగులు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమానాస్పదంగా గుర్తించిన టీ పొడి, చక్కెర నమూనాలను ప్రయోగశాల విశ్లేషణ కోసం పంపించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులలో కలిపి సుమారు 120 కిలోల మేర గడువు ముగిసిన, పాడైపోయిన, నిల్వలో చెడిపోయిన ఆహార పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. వీటిలో చికెన్, మటన్, మంచూరియా, తయారుచేసిన చికెన్ వంటకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, బియ్యం, నూడుల్స్, సాస్‌లు, ఫుడ్ కలర్స్, టీ పొడి, చక్కెర, నిమ్మ ఫ్లేవర్లు తదితర పదార్థాలు ఉన్నాయి. అనుమానాస్పదంగా గుర్తించిన ఐదు ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాల విశ్లేషణకు పంపించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఆహార వ్యాపార సంస్థలకు మెరుగుదల నోటీసులు జారీ చేయాలని అధికారులు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యాపారులకు, వీధి ఆహార విక్రేతలకు అవగాహన కల్పించారు. ఫుడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాలని, వాడే నూనెలను అనుమతించిన పరిమితిలోనే వినియోగించాలని సూచించారు. టీ పొడిలో రంగులు కలపరాదని హెచ్చరించారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ ఐ ఎఫ్ ఓ) విధానాన్ని పాటిస్తూ పాత స్టాక్‌ను ముందుగా వినియోగించాలని తెలిపారు. పండ్ల పక్వానికి కార్బైడ్ వినియోగం పూర్తిగా నిషేధమని, కేవలం ఎథిలీన్ సాచెట్ల ద్వారా మాత్రమే సురక్షిత పక్వ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు పాత వార్తాపత్రికలను ఉపయోగించరాదని, లూజ్ ఆయిల్స్ వినియోగం తగ్గించాలని, పరిశుభ్రమైన నిల్వ, శుభ్రమైన ఆహార తయారీ, సరైన హ్యాండ్లింగ్ పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రజలు కూడా ఆహారం కొనుగోలు చేసే సమయంలో పరిశుభ్రత, నిల్వ విధానం, గడువు తేదీలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు. అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపించినట్లయితే ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని కోరారు

# బంద్ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు

నల్గొండ టౌన్ , మే 19 (సూర్య సేన): దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన ఆల్ ఇండియా కెమిస్టుల మెడికల్ షాప్ ల బంద్ నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు అత్యవసర మందుల సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పట్టణాలలో మెడికల్ షాపుల యాజమాన్యాలకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రధాన పట్టణాలలో కనీసం రెండు, చిన్న పట్టణాలలో ఒక ప్రైవేట్ మెడికల్ షాప్ తెరిచి ఉంచి, అవసరమైన సేవలు అందించాలని సూచనలు జారీ చేశారు. అన్ని పట్టణాలలో కనీసం ఒక మెడిప్లస్ ఫార్మసీ, అపోలో ఫార్మసీ లు తెరిచి ఉంటాయి. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుబంధ ఫార్మసీలు అత్యవసర సేవల నిమిత్తం సాధారణంగా యధావిధిగా పనిచేయనున్నవని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా అవసరమైన మందులను సాధారణ విధంగానే కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా మందుల లభ్యతకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కింది నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు. సహాయం కోసం సంప్రదించవలసిన నంబర్లు: డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, నల్గొండ, 8333925882, బంద్ నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# క్రియేటివిటీనా... వల్గారిటీనా?



**వ్యూస్, ఫాలోవర్స్ కోసం**
**విలువలను తాకట్టు పెడుతున్న 'డిజిటల్' సంస్కృతి!**

ఒకప్పుడు సమాజంలో మంచి గుర్తింపు రావాలంటే ఎంతో ప్రతిభ ఉండాలి, కష్టపడే తత్వం ఉండాలి. అందరితో మెప్పు పొందాలంటే ఎన్నో ఏళ్ల సాధన అవసరమయ్యేది. కానీ, ఇప్పుడు చేతిలో ఒక స్మార్ట్‌ఫోన్, ముందొక కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు... ఎవరైనా రాత్రికి రాత్రే "స్టార్" అయిపోతున్నారు.

నిజానికి టెక్నాలజీ అనేది మనిషి ఎదుగుదలకు, కొత్త విషయాలు నేర్చుకోవడానికి వచ్చింది. కానీ, దురదృష్టవశాత్తూ అదే టెక్నాలజీ నేడు కొందరి చేతుల్లో సమాజ విలువలను పాడుచేసే ఆయుధంగా మారింది. "కంటెంట్" అనే పేరుతో అసభ్యతను, అశ్లీలతను సోషల్ మీడియాలో పెట్టి కొందరు వ్యాపారం చేస్తున్నారు. వ్యూస్ కోసం, లైక్స్ కోసం, ఫాలోవర్స్ కోసం తమ వ్యక్తిత్వాన్ని డిజిటల్ వేలం వేస్తున్నారు. ఇది కేవలం ఫోన్లకు పరిమితమైన ట్రెండ్ కాదు... సమాజాన్ని లోపలి నుంచి పాడుచేస్తున్న ఒక ప్రమాదకరమైన పరిస్థితి.

అశ్లీలతకు క్రియేటివిటీ అనే ముసుగు

"ఇది నా ఇష్టం", "ఇది మోడర్న్ కల్చర్", "ఇది ఒక ఆర్ట్" అంటూ కొందరు అసభ్యతను చాలా సులువుగా వెనకేసుకొస్తున్నారు. అశ్లీల డ్యాన్సులు, డబుల్ మీనింగ్ డైలాగులు, వ్యక్తిగత జీవితాన్ని పబ్లిక్ ప్రదర్శనగా మార్చడం... ఇవన్నీ ఇప్పుడు "కంటెంట్ క్రియేషన్" పేరుతో ట్రెండ్ అవుతున్నాయి. ఒంటిని ప్రదర్శిస్తే వ్యూస్ వస్తాయని, వివాదాస్పదంగా మాట్లాడితే ఫాలోవర్స్ పెరుగుతారని తెలిసిన తర్వాత... కొందరు తమ ప్రతిభను కాకుండా, విలువలను పక్కన పెట్టేస్తున్నారు. జనం బలహీనతలే వీళ్ల వ్యాపారానికి పెట్టుబడి. ఒక అసభ్య వీడియోకు లక్షల వ్యూస్ రాగానే, అది ఎంత దిగజారుడు కంటెంట్ అయినా, సమాజం "లైక్" కొట్టి దాన్ని సక్సెస్ అంటోంది. ఒక తప్పుడు విషయానికి వ్యూస్ వస్తే అది ట్రెండ్ అవుతుంది... ఆ ట్రెండే మెల్లగా మన సంస్కృతిగా మారిపోతుంది. ఇదే అసలైన ప్రమాదం.

డిజిటల్ నేరస్థులు ఎవరు? చేసేవారా... చూసేవారా?

అసభ్య కంటెంట్ చేసేవాళ్లను తిట్టడం చాలా తేలిక. కానీ వాళ్లను కోట్ల మందికి చేరువ చేస్తోంది ఎవరు? మనమే. మన ప్రతి "లైక్", ప్రతి "షేర్", ప్రతి "వ్యూ"... వాళ్ల వ్యాపారానికి మరింత బలాన్ని ఇస్తున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ లేకపోతే సప్లై ఉండదు. చూసేవాళు లేకపోతే, చేసేవాళ్లకు అంత ధైర్యం రాదు. కాబట్టి, ఈ డిజిటల్ కాలుష్యంలో కంటెంట్ చేసేవాళ్లే కాదు... దాన్ని ఆగి చూసే ప్రతి వ్యూయర్ కీ బాధ్యత ఉంది. నేడు సోషల్ మీడియా వేదికలు కేవలం వినోదం కోసం మిగలలేదు. కోపం, కామం, సంచలనం, గొడవలు... ఇవే ఇప్పుడు ఎక్కువ వ్యూస్ తెచ్చే వస్తువులుగా మారిపోయాయి.

యువత మనసుల్లో 'డిజిటల్ స్లో పాయిజన్' యువతరం ఎంతో సున్నితమైన వయసులో ఉంటుంది. వారు దేన్ని ఎక్కువగా చూస్తే దాన్నే త్వరగా ఫాలో అవుతారు. రోజుకు గంటల తరబడి రీల్స్, షార్ట్స్ చూస్తున్న నేటి యువతలో జీవితం పట్ల అవగాహన మారిపోతోంది. ప్రేమ అంటే బాధ్యత కాదు... కేవలం ఆకర్షణ మాత్రమే అనే భ్రమలో బతుకుతున్నారు. సక్సెస్ అంటే కష్టపడి పైకి రావడం కాదు... షార్ట్‌కట్‌లో శరీరాన్ని ప్రదర్శించి లేదా వివాదాలు సృష్టించి సులభంగా డబ్బు సంపాదించడమే అనే తప్పుడు ఆలోచనలు పెరుగుతున్నాయి. దీనివల్ల మహిళల పట్ల గౌరవం తగ్గుతోంది, బంధాల విలువ తెలియడం లేదు. ఈ రీల్స్ వ్యసనం వల్ల యువతలో ఓర్పు, ఆలోచనా శక్తి తగ్గిపోతున్నాయి. ఇది వినోదం కాదు... రేపటి తరం భవిష్యత్తుపై జరుగుతున్న మౌన దాడి. స్క్రీన్ వెనక మాయాజాలం: నీ బలహీనతే వారి వ్యాపారం సోషల్ మీడియా కంపెనీల అసలు లక్ష్యం మనకు వినోదం ఇవ్వడం కాదు... మనల్ని ఎక్కువసేపు ఫోన్ స్క్రీన్‌కు బానిసలుగా మార్చడం. మనం ఏ వీడియో దగ్గర ఎక్కువసేపు ఆగామో, ఏ అసభ్యత వైపు ఆకర్షితులమయ్యామో... వెనుక ఉన్న 'అల్గోరిథం' అంతా గమనిస్తుంది. ఆ తర్వాత అలాంటి కంటెంట్‌నే వరుసగా మన ముందుకు నెడుతుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన నిజం ఏమిటంటే... సోషల్ మీడియాలో మనం కస్టమర్ కాదు... మన సమయం, మన మనసు, మన బలహీనతలే అక్కడ అమ్ముడవుతున్న అసలు ప్రొడక్ట్. మత్తు పదార్థాలు మాత్రమే మనిషిని బానిస చేసేవి అనుకుంటాం .. ఇప్పుడు డిజిటల్ కంటెంట్ అదే పని చేస్తోంది.

స్వేచ్ఛ పేరుతో సామాజిక విధ్వంసం

నా అకౌంట్... నా ఇష్టం" అనే మాటకు కూడా కొన్ని హద్దులు ఉండాలి. వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో సమాజ మానసిక ఆరోగ్యాన్ని పాడుచేయడానికి ఎవరికీ హక్కు లేదు.



మన కంటెంట్ వల్ల లక్షలాది చిన్నపిల్లల ఆలోచనలు పాడవుతుంటే, యువత తప్పుదోవ పడుతుంటే... అది స్వేచ్ఛ కాదు, బాధ్యతారాహిత్యం. కళ అనేది సమాజాన్ని ఆలోచింపజేయాలి, మనిషిని మార్చాలి. కానీ అశ్లీలతను "ఆర్ట్" అని చెప్పడం... సంస్కృతిని చంపేయడమే. సమాజానికి హాని కలగకుండా మన భావాలను వ్యక్తపరచడమే నిజమైన స్వేచ్ఛ.

పరిష్కారం ఎక్కడ? మారాల్సింది ఎవరు? ఇన్ఫ్లుయెన్సర్లు: రెండు నిమిషాల ఫేమ్ కోసం జీవితకాల గౌరవాన్ని కోల్పోవద్దు. డబ్బు ఈరోజు వస్తుంది, రేపు పోతుంది. కానీ వ్యక్తిత్వం పోతే తిరిగి రాదు. సమాజాన్ని ప్రభావితం చేసే స్థాయికి వచ్చినప్పుడు బాధ్యతగా నడుచుకోవాలి.

యువత: ఎంతమంది మిమ్మల్ని ఫాలో అవుతున్నారన్నది కాదు... మీరు ఎలాంటి విలువలను ఫాలో అవుతున్నారన్నదే ముఖ్యం. వైరల్ కావడం గొప్ప కాదు... సమాజంలో విలువైన వ్యక్తిగా నిలవడం గొప్పది.

తల్లిదండ్రులు : పిల్లలకు స్మార్ట్‌ఫోన్ కొనిపెట్టడంతో బాధ్యత తీరిపోలేదు. వారు ఫోన్లలో ఏం చూస్తున్నారు? ఎవరిని ఫాలో అవుతున్నారు? అనే విషయాలపై కన్నేసి ఉంచాలి. ఈ కాలంలో "డిజిటల్ పేరెంటింగ్" చాలా అవసరం.

ప్రభుత్వం ఉ చట్టాలు: అశ్లీల కంటెంట్, డబుల్ మీనింగ్ రీల్స్ ద్వారా యువతను తప్పుదోవ పట్టించే వారిపై సైబర్ చట్టాల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత బలోపేతం చేయాలి.

సమాజం: మనమే అసభ్యతను చూడటం, ప్రోత్సహించడం మానేస్తే... దానికి డిమాండ్ దానంతట అదే తగ్గిపోతుంది.

మంచి ఆలోచనలను, సమాజానికి ఉపయోగపడే కంటెంట్‌ను మాత్రమే మన 'లైక్' ద్వారా సపోర్ట్ చేయాలి.

ఒక దేశాన్ని నాశనం చేయడానికి యుద్ధాలు అవసరం లేదు. ఆ దేశ యువత ఆలోచనలను, నైతికతను నాశనం చేస్తే చాలు... ఆ దేశ భవిష్యత్తు తనంతట అదే కూలిపోతుంది.

నేడు మనం చూస్తున్న ఈ డిజిటల్ అశ్లీల సంస్కృతి... కేవలం ఫోన్ స్క్రీన్‌కు పరిమితమైన తాత్కాలిక సమస్య కాదు. ఇది సమాజపు నైతిక పునాదులను లోపల నుంచే తవ్వేస్తున్న ఒక నిశ్శబ్ద విపత్తు! వ్యూస్ కోసం విచక్షణను, లైక్స్ కోసం లజ్జను, ఫాలోవర్స్ కోసం భవిష్యత్తును తాకట్టు పెడుతూ పోతే... రేపు మనం చూసేది ప్రగతి పథంలో నడిచే "డిజిటల్ ఇండియా" కాదు, విలువలు పూర్తిగా శూన్యమైన ఒక రోగగ్రస్త సమాజం. స్మార్ట్‌ఫోన్ అనే శక్తివంతమైన సాధనం ఇప్పుడు మన చేతిలోనే ఉంది. దాన్ని సంస్కృతిని కూల్చే ఆయుధంగా వాడుకుందామా? లేక రేపటి తరాన్ని తీర్చిదిద్దే సంస్కారంగా మార్చుకుందామా? తేల్చుకోవాల్సింది మనమే. ఎందుకంటే... మనకు కావలసింది క్షణకాలం ట్రెండ్ అయ్యే అసభ్యత కాదు, తరతరాలు గర్వపడే ఉజ్వల భవిష్యత్తు!

జి. అజయ్ కుమార్

# అసాంఘిక చర్యలకు, నేరాలకు పాల్పడితే రౌడీ షీట్స్, పిడి యాక్ట్ నమోదు చేస్తాం...

**– జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్**

**సూర్యాపేట క్రైమ్, మే 19 (సూర్య సేన) :** కేసుల్లో సస్పెక్ట్ షీట్స్, హిస్టరీ షీట్స్, గంజాయి కేసుల్లో షీట్స్ ఉన్న వ్యక్తులకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు డివిజన్ స్థాయి కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ నరసింహ హాజరై మాట్లాడారు. గతంలో చేసిన పనుల నుండి పాఠాలు నేర్చుకుని సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. సమాజ హితం కోసం, మంచి పనుల కోసం పాటుపడాలని కోరారు. అసాంఘిక చర్యలకు, నేరాలకు పాల్పడుతూ ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్ నమోదు చేస్తాము, పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తాం అని హెచ్చరించారు.

ప్రతి నెలా కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందరిపై పోలీసు నిఘా ఉన్నది ప్రస్తుత జీవన శైలి, ఎలాంటి పనులు చేస్తున్నారు అని గమనిస్తున్నామన్నారు.

మంచి ప్రవర్తన కలిగి ఉంటే ఎలాంటి ఫైరవిలు లేకుండా క్షుణ్ణంగా పరిశీలన చేసి చట్టప్రకారం షీట్స్ ఎత్తి వేస్తామని అన్నారు. అలవాటుగా నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కటిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.



కేసుల్లో పోలీసు దర్యాప్తులో వేగం, నాణ్యత పెరిగినది పక్కా ఆధారాలతో కోర్టులకు పంపిస్తాం అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి వ్యక్తులపై భౌతిక దాడులకు పాల్పడవద్దని అని కోరారు. కేసుల్లో త్వరితగతిన శిక్షలు అమలౌతున్నాయి అన్నారు. గరిడేపల్లి, మెళ్లచెరువు, మునగాల,

మోతే పోలీస్ స్టేషన్ ల నందు నమోదైన హత్య కేసుల్లో జీవిత ఖైదీ శిక్షలు పడ్డాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, శివతేజ, మహేందర్ నాథ్, ఐలయ్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల నృత్యానికి కలెక్టర్ ఫిదా చిరు బహుమానం

**– ముగిసిన బాల భవన్ సమ్మర్ క్యాంప్**

**భానుపురి, మే 19 (సూర్య సేన) :** జిల్లా బాల్ భవన్ సమ్మర్ క్యాంప్ లో జరిగిన అద్భుతం కలెక్టరేట్ లో విద్యా వారోత్సవాలు ముగింపు సందర్భంగా బాల్ భవన్ చిన్నారులు రెండు నృత్యాలు పేరిణి శివ తాండవం,

జానపద కళారూపం లంబాడా ప్రదర్శించగా కళా హృదయం కలిగిన జిల్లా కలెక్టర్ అభినందించి, సంతోషంతో స్పాట్ లో ఒక్కో నృత్యానికి పదివేలు చొప్పున చిన్నారులకు బహుమానం అందించారు. ఆ సందర్భాన్ని చూసి డిఈఓ, ఎంఈఓ, ఎస్ ఓ ,ఇతర అధికారులు, అతిథులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. హాజరైన చిన్నారులు ,తల్లితండ్రులు , బాల భవన్ సిబ్బంది సంతోషానికి అవధులు లేవు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐపీఎస్, అధికారులకు బాల్ భవన్ మరియు అందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజాక్షేత్రంలో భయపెడుతున్న గ్రామ సింహాలు



- పిక్కలు పీకేస్తున్న శునకాలు. చిన్నారులు వృద్ధులపై తరచు దాడులు.
- పశువులు జింకలు, గొర్రెలు పందులపై దాడులు
- రంగారెడ్డి జిల్లాలో రోజుకు సగటున 20 నుండి 25 కుక్క కాటు కేసులు నమోదు

**రంగారెడ్డి, మే 19 (సూర్య సేన) :** ఇంటి ముందు తచ్చాడుతూ విశ్వాసంగా ఉండే గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి దారిన వచ్చి పోయే వాహనదారులతో పాటు ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులు ఆరు బయట నిద్రపోతున్న వృద్ధులపై విరుచక పడుతున్నాయి. వీధి కుక్కల దాటికి గొర్రెలు మేకలు, జింకలు, నెమళు బలైపోతున్నాయి. కాపలాదారులు కంటిమీద కునుకు లేకుండా గడపాల్సి వస్తుంది జిల్లాలో రోజుకు సగటున 20 నుండి 25 కుక్క కాటు కేసులు నమోదు అవుతూ ఉండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. అత్యవసర పరిస్థితులలో సమీప ఆసుపత్రులలో యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ లేక నగరంలో ఐపిఎం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులకు పరుగులు తీయవలసి వస్తుంది. ఏటా పెరుగుతున్న బాధితులు. జి హెచ్ఎం శ్రీపరిధిలో దాదాపు లక్షన్నర కుక్కలు ఉండగా జిహెచ్ఎంసి గా మారి విస్తీర్ణం పెరగడం శివారు ప్రాంతాలలోకి పొరుగు జిల్లాల నుంచి కుక్కలు వలస రావడంతో ప్రస్తుతం వీటి సంఖ్య ఎనిమిది లక్షలకు చేరినట్లు అంచనా. ఎనిమల్ బర్త్ కంట్రోల్ ( ఏ బి సి ) కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు ( స్టెరిలైజేషన్ ) చేసేందుకు గ్రేటర్ జిల్లాలోని ఆటోనగర్ అంబర్పేట్ చుడి బజార్ జీడిమెట్ల పటాన్చెరు కేంద్రాలను ఏర్పాటు చేసింది వీటిలో 80,000 కుక్కలకు టీకాలు వేస్తున్నారు .నెలకు రెండువేల కుక్కలకు స్టెర్లైజేషన్ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయినా సంఖ్య తగ్గకపోగా కుక్క కాటు బాధితులు మాత్రం ఏటా పెరుగుతూనే ఉన్నారు. సిటీలో పట్టి శివారులో వదిలి బస్తీలో పట్టిన శునకాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతల ఉన్న నిర్మానుష ప్రాంతంలో వదిలేస్తున్నారు. కొన్ని అడవులకు వెళ్లి వేటాడుతుండడంతో అక్కడ ఉన్న జింకలు నెమళ్లు ఇతర జంతుజాలాలు భయంతో అడవిని వీడి నివాస ప్రాంతాల్లోకి వచ్చి చేరుతున్నాయి. మరికొన్ని కుక్కలు సమీప కాలనీలలో గ్రామాల్లోకి వస్తున్నాయి ప్రస్తుతం బగ్గు మంటున్న ఎండలకు తోడు ఆహారం తాగేందుకు నీరు కూడా దొరకపోవడంతో ఆకలితో చెత్తకుప్పల్లో కుళ్ళిన ఆహార పదార్థాలు తిని పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయి వీధులలో వచ్చి పోయే వారిని పిక్కలు పీకేస్తున్నాయి. మూగజీవాలు మృత్యువాతకు కారణం అవుతున్నాయి. మచ్చుకు కొన్ని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో రెండు నెలలలో దాదాపు 300 పైగా కుక్క కాటు కేసులు నమోదు అయ్యాయి. గత ఏప్రిల్ లో అత్యధికంగా 1073 మంది కుక్కకాటుకు గురి అయ్యారు యాచారం మండల పరిధిలో ఆసుపత్రి వైద్యులు లెక్కల ప్రకారం నెలరోజుల వ్యవధిలోనే వీధి కుక్కలు 88 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి అనిలెక్కలేనివి మరో 20 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 600 కు పైగా కుక్క కాటు కేసులు నమోదు అయ్యాయి. ఒక్క నెలలోనే 150 కి పైగా కేసులు నమోదు అయినట్లు వైద్యులు తెలిపారు. కుక్క కరిస్తే. కుక్క కరిస్తే వెంటనే ధారగా కారుతున్న నీటితో పది నుంచి పదిహేను నిమిషాల పాటు శుభ్రం చేయాలి రక్తం కారుతున్న గాయాలపై కట్టు కట్టకూడదు మట్టి పసుపు ఆకుపసరు ఒంటివి పోయకూడదు. వెంటనే సమీప ఆసుపత్రికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ చేయించాలి కుక్క కరిచిన వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి తరువాత 37. 14 . 28 విధిగా వ్యాక్సినేషన్ చేయించుకోవాలి. జాగ్రత్తలు ఇలా తీసుకోవాలి వీధి కుక్కలను ఓ బహిరంగ ప్రదేశానికి తరలించి అక్కడే వాటికి ఆహారం మీరు అందజేయాలి ఎనిమల్ బర్త్ కంట్రోల్ లో భాగంగా వాటికి సంతాన నిరోధక చికిత్సలు చేయించి వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాలలో తిరగకపోవడం మొత్తం ఇంట్లో ఉన్న వాళ్లకు ప్రతి మూడు మాసాలకు ఒకసారి వ్యాక్సినేషన్ చేయించాలి.

# వారంలోగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





- దిగుమతులు వేగవంతం చేయడానికి మరిన్ని అన్‌లోడింగ్ పాయింట్ల గుర్తింపు
- రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ సుడిగాలి పర్యటన

**సూర్యాపేట, మే 19 (సూర్య సేన) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రానున్న వారం రోజుల్లో నిర్దేశిత కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన లిఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని రైస్ మిల్లుతో పాటు, పాతర్లపాడు గ్రామంలోని అరోహి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. మద్దిరాల మండల కేంద్రం మరియు గుమ్మడివల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తుంగతుర్తి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని కొనుగోలు కేంద్రంతో పాటు, వెంపటి గ్రామం, రావులపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు.

తిరుమలగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నాగారం మండలం ఈటూరి గ్రామంలోని 'సోమేశ్వర రైస్ మిల్లు'ను సందర్శించి అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు వీలుగా, పెద్ద ఎత్తున అన్‌లోడింగ్ పాయింట్లను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

రానున్న వారం రోజులు అత్యంత కీలకమని కాబట్టి అధికారులు, మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి లారీలను వేగంగా అన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆత్మకూర్ (ఎస్) తహసిల్దార్ హమీసింగ్, నూతనకల్ తహసిల్దార్ శ్రీనివాసరావు, మద్దిరాల తహసీల్దార్ తబిత, వ్యవసాయ శాఖ ఎ ఓ రుహి, తుంగతుర్తి తాసిల్దార్ దయానంద్ ఎంపీడీవో శేషు కుమార్, ఏ డి ఏ రమేష్ బాబు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసింది కెసిఆరే



- డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత

**నల్గొండ టౌన్, మే 19 (సూర్య సేన) :** పది సంవత్సరాల తెలంగాణ పాలనలో కేసీఆర్, ఆయన చెంచాలు రైతులకు ద్రోహం చేసి వారి ఖజానా నింపుకున్నారని డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఎద్దేవా చేశారు. మంగళవారం పట్టణంలోని యాదవ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏక కాలంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ అంటూ రైతులను ముంచిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. కెసిఆర్ పాలనలో సుమారు పదివేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కల్లాల వద్ద రైతులు చనిపోయిన సంఘటనలు నేటికీ గుర్తుకు ఉన్నాయన్నారు. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసి హింసించిన సంఘటనలు ప్రజలు మర్చిపోలేదన్నారు. వరి వేస్తే ఉరి అని రైతులను మోసం చేసింది కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. మోడీ లాంటి పాసిస్టు లు రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకువస్తే వారికి వంత పాడింది కెసిఆర్ ఆని జిల్లాలో మిల్లర్లతో కుమ్మక్కై వంద కోట్లు సంపాదించింది ఆనాటి మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే. వారి అక్రమ దందాకు సీఎం రేవంత్ రెడ్డి చెక్ పెట్టి సన్న బియ్యం ఇస్తున్నారని గుర్తుకు చేశారు. దేశభక్తుడు, నిజాయితీపరుడైన మంత్రి ఉత్తంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించం బిఆర్ఎస్ నాయకుల నాలుక తెగ కోస్తాం అని హెచ్చరించారు .ఆరుసార్లుగా ఎమ్మెల్యేగా గెలిచి, రెండుసార్లు మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలు అందించిన ఉత్తంకుమార్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలని తప్పుతోవ పట్టించాలని చూస్తుందని అన్నారు. ప్రజానాయకునిగా అందరి మన్ననలు పొందిన ఉత్తంకుమార్ రెడ్డి కాలిగోటికి బిఆర్ఎస్ నాయకులు సరిపోరు అన్నారు. ఉచిత కరెంటు ,2 లక్షల రుణమాఫీ, ప్రతి క్వింటాకు 500 బోనస్ తీసుకువచ్చి దేశ చరిత్రలో నిలిచిపోయిన పాలన అందిస్తున్నదని రేవంత్ సర్కార్ అని కొనియాడారు. అవినీతి ఆరోపణలతో ఉద్యోగాలు కోల్పోయిన బిఆర్ఎస్ నేతలు మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. ఉద్యోగాలు పోయిన వజిబ్ దారులు మీటింగ్ పెట్టారని అన్నారు. 75% వరి ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యాయని ఈనెల 25వ తేదీ లోపు 100% పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు మంత్రులు రాత్రి పగలు లేకుండా ఐకెపి సెంటర్స్ సందర్శించి రైతులకు భరోసా ఇస్తున్నారని అన్నారు ఇస్తున్నారని అన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, మధ్యతరగతి ప్రజల దీవెనలతో 2029లో మరోసారి తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ రానున్నాదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాల రవీందర్ రెడ్డి, బోడ స్వామి,పగిళ్ల రాజు, చర్లపల్లి గౌతమ్,మధగోని వెంకన్న, వావిళ్ళ దేవదాస్, నాగరాజు,పొట్ట మధు, శరత్, వినీత్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచిన ధ్యాన ఆంజనేయ దేవాలయ ఆదాయం.....



**రంగారెడ్డి, మే 19 (సూర్య సేన) :** కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ ఆదాయం తెలంగాణ రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ నగరం లో ప్రసిద్ధిగాంచిన శ్రీ కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం గత రెండు సంవత్సరాలుగా శనివారం మంగళవారం రోజుల్లో ఆంజనేయ స్వామి దర్శనం కోసం వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. శనివారం మంగళవారం ప్రత్యేకంగా సెలవులు ఉంటే సుమారు 50 వేల వరకు భక్తులు దర్శనం చేసుకున్నట్లు అధికారికంగా తెలుస్తుంది .తెలంగాణ రాష్ట్రంలో 20,25 ,26వ సంవత్సరం యాదగిరిగుట్ట ఆదాయం మొదటి స్థానంలో ఉండగా పదవ స్థానంలో శ్రీ కర్మన్ఘాట్ జానాంజనేయ స్వామి దేవాలయము, 8 కోట్ల 73 లక్షల 46 వేలకు వచ్చింది అని దేవాలయ కమిషనర్ లావణ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పదో స్థానంలో ఉండడం సంతోషంగా ఉందని శనివారం మంగళవారం రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు .దేవాలయ అభివృద్ధికి



దాతల సహకారం ఎంతైనా అవసరమని అన్నారు. అర్చకులు సిబ్బంది నిరంతర కృషితో అసిస్టెంట్ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ల స్థాయిలో ఉన్న దేవాలయాల కన్నా ఆదాయంలో శ్రీ కర్మన్ఘాట్ దేవాలయం పదో స్థానంలో నిలబడింది అన్నారు .ఆలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్న ఆలయం ఆదాయం పెరిగే విధంగా చేసేందుకు కృషి చేసిన అధికారులకు ఆమె అభినందనలు తెలిపారు.

# జీవితం ఒక రంగుల రాట్నం!

మనిషి జీవితంలో
కాలం చక్రం ముఖ్యమైంది
చక్రం పైన కదిలే రంగుల
రాట్నమే జీవితం

కాల చక్రం క్షణ కాలం
నిన్ను ఆకాశానికి
తీసుకెళ్తుంది
మరు క్షణంలోనే
నేల పైకి లాగుతుంది

పైకి వెళుతున్నప్పుడు
కలిగే సంతోషం
కిందికి వచ్చినప్పుడు
కలిగే కలవరం
రెండు క్షణ కాలం
ముచ్చట్లేనని గుర్తు
చేస్తూ సాగుతుంది
జీవన పయనం

జీవితంలో కష్ట సుఖాలు
కలిమి లేములు కావడి కుండలే
కలిమి అనే రంగు వెలిగిపోతుంటే
లేమి అనే రంగు వెక్కిరిస్తోంది
కష్ట సుఖాల రంగులన్నీ కలిపి
జీవితంలో నాటకాలు ఆడిస్తాయి

జీవితం ఒక నాటకం
మనిషి పాత్రలు పోషించాలి
బాధ్యతలు అనుబంధాలు
కొనసాగించాలి

జీవితం సంఘర్షణల మయం
సవాళ్లు ప్రతి సవాళ్లు
సమస్యలు సంక్షోభాల
చక్రబంధంలో చిక్కుకొని
సుఖ దుఃఖాలు అనుభవించాలి

లక్ష్య సాధనలో విఫలమైతే
ఏడవకు రెట్టింపైన ఉత్సాహంతో
విజృంభించు సామర్థ్యాన్ని
నిరూపించు విజయాన్ని చేపట్టు
పడిపోయాయని బాధపడకు

పైకి లేచే సమయం వస్తుంది
గెలిచాననే గర్వం వద్దు
పతనం చెందే కాలం ఉంటుంది

జీవితమంటే సుఖాలు
మెరుపులు కష్టాల మబ్బులు
దాటుకుంటూ వెళ్ళాలి
జీవితం పూల బాట కాదు
ముళ్ళ బాటను దాటుతూ
వెళ్ళాలి

జీవితమనే రంగుల రాట్నంలో
సమతుల్యత కోల్పోవద్దు

జీవితం కేవలం భౌతిక
రూపం కాదు
నిరంతరం ప్రవహించే
జీవన ప్రవంతి

ఆప్రవాహంలో
ప్రతి హృదయానికి
సుమధుర అనుభూతుల
పరిమళాలు ఉంటాయి.

కాలం అనే తోటలో
సమస్యల ఎండ తీవ్రతకు
ఆశల రేకులు వాడిపోవచ్చుకానీ
అంతరాత్మలో దాగి ఉన్న
ఆత్మవిశ్వాసం జీవితాంతం
ఉంటుంది

జీవితంలో బాధలు
గాయాలనుండి సహనమనే
అద్భుత సుగంధం జనిస్తుంది

నలుగురికి ప్రేమ పంచడంతో
జీవితం పరిమళభరితమౌతుంది

స్వార్థపు చీకట్లను చీల్చుకుంటూ
ఆశయాల అమృతాన్ని చిలకరిస్తూ
రేపటికి గెలుపుకు నేడే పునాది
వేస్తూ జీవించడమే

జీవిత పరమార్థం

మనం కనుమరుగైన
మనం వదిలి వెళ్లిన
మంచితనపు జ్ఞాపకాలు
జగత్తులో అంతర్లీనంగా
ఉంటాయి
జన్మకు సార్థకతను ఇస్తూ
ధైర్యంగా ముందుకు
సాగడమే జీవిత చక్రం

ఉజ్వల భవిష్యత్తు
జీవితానికి ఆశ అనే
వెలుగునివ్వాలి
ప్రగతిశీల సమాజ
నిర్మాణమే
నీకర్తవ్యం కావాలి.
అంతరాలు ఎరగని
సామాజిక సమరసతను
స్వాగతిద్దాం మానవీయ
పరిమళాల ప్రగతికి
పురోగతికి బాట వేద్దాం



**నేదునూరి కనకయ్య**
**1)అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం కాలమిస్ట్ రచయిత**
**2)మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి**
**3)మాజీ కరెస్పాండెంట్ జస్టిస్ కుమారయ్య లా కాలేజీ కరీంనగర్**
**9440245771**

# బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి

- హ్యూమన్ రైట్స్ పౌండేషన్ కార్యదర్శి డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాస్

**రంగారెడ్డి, మే 19 (సూర్య సేన) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ ఎస్ శ్రీనివాస్ కోరారు.



మంగళవారం పత్రికలకు పర్యటన విడుదల చేస్తూ, ఇటీవల బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ, ఒక అమ్మాయిని వేధించిన కేసులో, ఇటీవల బండి సంజయ్ పోలీసులకు చదివింపులు చెప్పి భగీరథను అప్పగించారని, తక్షణమే పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పెద్ద హోదాలలో ఉన్న వారి పిల్లలు మరో 10 మందికి స్ఫూర్తిదాయకంగా ఉండాలి కానీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలని, ఆయన డిమాండ్ చేశారు. పేదవాడికి ఒక న్యాయం ఉన్నవాడికి ఒక న్యాయం అనే విధంగా పోలీసులు న్యాయవ్యవస్థ వ్యవహరిస్తుందని ఈ విధానం సరికాదని శ్రీనివాస్ అన్నారు.

# చెక్ పోస్ట్ ల వద్ద పటిష్టమైన భద్రత మరియు నిఘా అవసరం

**నల్గొండ, మే 19 (సూర్య సేన) :** బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన భద్రతా మరియు నిఘా అవసరమని జిల్లా పశు వైద్య మరియు పశువైద్య శాఖ అధికారి డాక్టర్ జి. వి. రమేష్ తెలిపారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలోని ఆరు చెక్‌పోస్టుల వద్ద పోలీసు మరియు పశువైద్య సిబ్బందిని 24 గంటల పాటు విధుల్లో నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. చెక్‌పోస్టుల ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలకు అనుగుణంగా పశువుల రవాణా జరుగుతుందో లేదో పరిశీలించాలని సూచించారు. సరైన పశు వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్న వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.

ఈరోజు జిల్లాలోని ఆలగడప అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్, వాడపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ మరియు అవంతిపురం పశువుల సంతను సందర్శించిన డాక్టర్ జి.వి. రమేష్ అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల రవాణా సమయంలో జీవహింస నివారణ చట్టం-1960, గోహత్య నివారణ చట్టం-1977 మరియు పశువుల రవాణా చట్టం-1978 ప్రకారం అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన తెలిపారు. పశువుల సంతలలో పశువులకు పరిశుభ్రమైన తాగునీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పరిమితికి మించి పశువులను లోడ్ చేసిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరెడ్డి, పశువైద్యులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ స్వప్న , డాక్టర్ శశికళ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంపాదకీయం

బుధవారం, మే 20, 2026

## ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ..!

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్–లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం – రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్ఛిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ తరువాత.. బుధవారం సాయంత్రం నాటి ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో ఆ తీర్మానాన్ని తిరస్కరించింది లోక్‌సభ. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటింది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు. అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా స్థానాలకే పరిమితమైన ఈ కూటమి, ఈసారి క్షేత్రస్థాయిలో టీఎంసీ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు మళ్లకుండా తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను అస్త్రాలుగా చేసుకుని మమతా కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్–కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మమతా బెనర్జీ క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు. మమతా బెనర్జీని పూర్తిగా ఓడించలేకపోయినా, ఆమెకు మ్యాజిక్ ఫిగర్ అందకుండా చేయడమే ఈ కూటమి అసలు టాస్క్. తద్వారా రాష్ట్రంలో టీఎంసీ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చని వీరు భావిస్తున్నారు. మమతా వ్యతిరేక ఓట్లు కేవలం బీజేపీకే పడతాయనే భ్రమను తొలగించి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఈ కూటమి ఎంతవరకు సఫలమవుతుందనేది బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ వీరు గణనీయమైన స్థానాలు సాధిస్తే, అది బెంగాల్ రాజకీయాల్లో మమతా శకానికి ముగింపు పలికే తొలి అడుగు అవుతుందని అనుకోవచ్చు. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి.


## సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


# అటు రంగస్థలం.. ఇటు విద్యావనం







నాటకాన్ని ప్రేమించి, నటుడిగా శ్రమించి, నిరంతరం నాటక కళామతల్లి సేవలో పునీతమవుతున్న కళాకారుడు కూనపరెడ్డి సత్యనారాయణ. ఒక్కపక్క రంగస్థలంలో రాణిస్తూనే– మరోపక్క విద్యారంగంలోనూ విలువైన సేవలు అందిస్తున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా రంగస్థల నటుడిగా ఆయన రాణిస్తున్నారు. నటనలో ఎన్టీఆర్, ఎస్వీఆర్, ఏఎన్నార్‌లను అనుకరించే ఆయన పౌరాణిక నాటకాల ప్రదర్శనలను బాగా ఇష్టపడతారు. కంచుకంఠంతో డైలాగుల డెలివరీలో స్పష్టత ప్రదర్శిస్తారు. ఏ పాత్రలోనైనా ఒదిగిపోయి జీవిస్తారు. కళాకారుడిగా తనకు నచ్చి, మెచ్చిన నాటక రంగ ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వెళ్లి పాల్గొంటారు. తనదైన శైలిలో హావభావాలు ప్రదర్శిస్తూ శభాష్ అని పిలిపించుకుంటారు.

కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కూనపరెడ్డి వెంకమ్మ, నాగేశ్వరరావు దంపతుల కుమారుడు సత్యనారాయణ. చెన్నూరు గ్రామం కళాకారులకు పుట్టినిల్లు. ఆ గ్రామంలో గతంలో ప్రతి ఇంట్లో ఒక కళాకారుడు ఉండేవారు. ఆయన తండ్రి నాగేశ్వరరావు శ్రీరామాంజనేయుద్ధంలో యయాతి, రామాంజనేయ యుద్ధంలో బూరికీర్తి, కురుక్షేత్రంలో ధర్మరాజు పాత్రల్లో దిట్ట. తండ్రిలోని గాత్రం, నటనాశైలిని పుణికిపుచ్చుకున్న సత్యనారాయణ తనకంటూ సరికొత్త ఒరవడితో నాటక రంగ కళాకారుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందారు. ప్రముఖ రంగ స్థల నటులు ఆచంట వెంకటరత్నం నాయుడు గాత్రాన్ని సత్యనారాయణ అన్వయిస్తూ పద్యాలు అవలీలగా పాడతారు. విజయనగరానికి చెందిన బి.రామచంద్రరావు నాయుడు స్ఫూర్తితో ఆయన విశ్వామిత్ర పాత్రను ఎంపిక చేసుకున్నారు. విశ్వామిత్ర రాజరుషి పాత్రలో వికటాట్టహాసం కాకుండా అవసరం మేరకే రాగాలాపన చేస్తారు. డైలాగుల డెలివరీలోనూ, పద్యాల ఆలాపనలోనూ స్పష్టతతో కంచుకంఠంతో ఆలపించేవారు. పదాన్ని విడమర్చి చెప్పటంలోనూ దిట్ట. మహానటులు ఎన్టీఆర్, ఎస్వీఆర్ వంటి సినీరంగ ప్రముఖుల సినిమాలను వీక్షిస్తూ వారిని అనుకరించేవారు. డైలాగుల డెలివరీ అచ్చు వారిలాగే ఉండేది. పద్యాలు ఆలపించటంలోనూ, రాగాలు తీయటంలోనూ, హావభావాలను ప్రదర్శించటంలోనూ సరికొత్త ఒరవడి ప్రదర్శించారు. సత్యనారాయణ తన 11వ ఏటనే పాఠశాలలోని వివిధ వేదికలపైన తన నటనను ప్రదర్శించి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల నుంచి అభినందనలు అందుకున్నారు. తెలుగు పండితులు మద్దూరి రామ్మోహనరావు ఆయన నటనా కౌశలాన్ని ప్రోత్సహించి అనేక నాటికల ప్రదర్శనలకు అవకాశం కల్పించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలోనూ, ఐటిఐ, డిప్లమోను కాకినాడలో పూర్తిచేశారు. అనంతరం ధవళేశ్వరంలో సాంకేతిక విద్యకు సంబంధించిన శిక్షణను పూర్తిచేశారు. అటు కళాశాలఉద్యోగం, ఇటుకళారంగంలో ప్రతిభను సుసంపన్నం చేసుకు న్నారు. ఎందరో విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ మార్గ దర్శకులుగా నిలిచారు. ఐటిఐ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టి కళాశాల ప్రిన్సిపల్‌గా స్థిరపడ్డారు. ఆ తర్వాత ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాలను స్థాపించి ఏటా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఏడు పదుల వయస్సులోనూ నాటక ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొంటూ తనలోని కళాపిపాసను బయటపెడుతున్నారు. ఎక్కడ నాటక కళాప్రదర్శనలు జరిగినా వెళ్లి వీక్షిస్తూ వాటిని ప్రోత్సహించటంలోనూ ఆయన ముందుంటారు. కళాకారుడిగా పలు పాత్రల్లో ఆయన నటించి మెప్పిస్తున్నారు. పాత్ర ఏదైనా పరిణితి నటనతో అందులో జీవించటం ద్వారా ఉత్తమ నటుడిగా అనేక పురస్కారాలు, అభినందనలు అందుకున్నారు. పౌరా ణిక నాటకాల్లో సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రునిగా, రామాంజనేయ యుద్దంలో లక్ష్మణుడిగా ఆయన నటనా కౌశలం అద్భుతం. పల్లెపడుచు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, పూలరంగడు సాంఘిక నాటకాల్లో ఆయన కనబర్చిన నటన అద్వితీయం. జై శ్రీ నాట్యమండలి అధినేత కీర్తిశేషులు కొడాలి వీరాంజనేయులు గారి కుమారుడు కొడాలి రాజా వద్ద పౌరాణిక నాటకాల్లో నటనా ప్రావీణ్యం పొంది దుద్దుకూరి సాయి బాబు, కోరుకొల్లు నాని ప్రోత్సాహంతో జూనియర్ డివి సుబ్బారావు, పద్మశ్రీ వై.గోపాలరావు, ఉప్పాల నాంచారయ్య, ఉప్పలపాటి సైదులు, పి.లక్ష్మణరావు, బెండపూడి రామారావు, కిలారు లక్ష్మి, జయ నిర్మల, బొబ్బిలి సావిత్రి, ఎ.వెంకటేశ్వరరావు, పి.వి.రామాంజనేయులు మొదలైన వారితో కలిసి నటించారు. పౌరాణిక సంస్థల దిగ్గజాల చేత కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చి మెప్పించారు. విద్యావేత్తగా, విద్యాసంస్థ అధినేతగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఆయన తన వంతు పాత్ర పోషిస్తున్నారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి శిక్షణకు అవసరమైన కోర్సులు ఎంపిక చేసుకునేలా 'స్పామ్' ఐటిఐను ముదినేపల్లిలో ఏర్పాటు చేశారు. గత 30 సంవత్సరాలుగా అత్యుత్తమ విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నారు. కళా,సాంస్కృతిక, భాషా రంగాల్లో అపారమైన అనుభవం, ప్రజ్ఞ ఉన్న ఆయన నిరంతరం కొత్త విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తమ కళాశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులను ఉపాధి శిక్షణలో సరికొత్త ఒరవడి, నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. కోర్సు పూర్తయిన వెంటనే జీవనోపాధి పొందేలా ఉపాధి, నైపుణ్య కోర్సుల్లో వారిని ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి కల్పనా శాఖల ద్వారా ఇచ్చే శిక్షణల్లోనూ పాల్గొనేలా చేస్తున్నారు.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం



గుంటూరు, : తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలోగిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే. ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకు తోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొను గోలు చేస్తున్నారు. మార్కెట్?లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

రైతులకు ఆనందం: వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తు న్నారు. మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళ వారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేలధర పలుకుతోంది. సన్న రకాలకుడిమాండ్ బాగా పెరిగింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజన కంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నా రు. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

## సోషల్ మీడియా రూమర్లు..
# బంకుల వద్ద భారీ క్యూ లైన్లు

చంపాపేట్ : పెట్రోల్, డీజిల్ కొరత పై సోషల్ మీడియా వదంతులు వ్యాప్తి చెందడంతో నగరంలో ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ, పరిస్థితి పూర్తిగా అదుపులోకి రావడం లేదు. ఇదే సమయంలో, ఎల్పీజీ, సీఎన్జీ గ్యాస్ సరఫరా పై అనుమానాలు నెలకొనడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గ్యాస్ బంకుల వద్ద భారీ రద్దీ కనిపిస్తోంది. ముఖ్యంగా మలక్‌పేట్, సంతోష్‌నగర్, చదర్‌ఘాట్ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు, ఆటోలు క్యూ లైన్లలో నిలిచిపోయాయి. ప్రజలు ముందస్తుగా గ్యాస్ నింపించుకోవాలని పెద్దఎత్తున బంకుల వద్దకు తరలివస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుండటంతో వారి ఆదాయం పై ప్రభావం పడుతోంది. ఇక, ఇటీవల పెరిగిన డిమాండ్ కారణంగా నగరంలో ఇంధన వినియోగం సుమారు 25 శాతం వరకు పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# పేదల జోలికి వస్తే ఊరుకోం...



– తెలంగాణ రాజ్యాధికార
పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్

**సూర్యాపేట టౌన్, మే 19 (సూర్య సేన) :** సూర్యాపేటలో పేదల భూములు, ఇళ్ల నిర్మాణాల విషయంలో జరుగుతున్న అన్యాయాలను సహించబోమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నల్లు ఉమా జ్యోతి రెడ్డి, నల్లు చిత్రరంజన్ రెడ్డి పై కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. జగదీశ్వర్ రెడ్డి ప్రోత్సాహంతో అక్రమాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపడుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలను కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న ఇనుప సామగ్రి, రాడ్లు వంచే యంత్రాలను మున్సిపల్ సిబ్బంది బలవంతంగా తీసుకెళ్లారని ఆరోపించారు. లక్షల రూపాయల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. సూర్యాపేట రూరల్ పోలీసులు సివిల్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. ఇదే విధంగా వ్యవహరిస్తే తదుపరి పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అని హెచ్చరించారు. చట్టపరమైన అంశాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, పేద ప్రజలు కష్టపడి నిర్మించుకుంటున్న ఇళ్లపై పరోక్షంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే అన్ని పత్రాలతో ప్రజల ముందుకు వస్తామని స్పష్టం చేశారు. భూవివాదంలో సంబంధం ఉన్న వారందరిపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వట్టే జానయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు బొల్లే సైదులు, కుంభం వెంకన్న యాదవ్, మధు, చాప్లా, రాగం లింగయ్య, చింత సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# రేపు నేరేడుచర్ల లో ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు



**పాలకీడు ప్రతినిధి, మే 19 (సూర్య సేన) :** ఈనెల 21వ తేదీన తెలంగాణ ప్రజానాట్యమండలి సూర్యాపేట జిల్లా నాలుగవ మహాసభలు నేరేడుచర్లలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో పాలక వీడు మండల సిపిఐ కార్యదర్శి ముల్ల జానయ్య నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస రెడ్డి తో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ.....

సమాజక క్రాంతికి కళలే ఆధారమని మాటలు రానిరోజుల్లో ఒకరికొకరు తమ అవసరాల కోసం చేసుకున్న సైగలే ఆ తరువాత కళారూపాలుగా తయారయ్యాయని ప్రపంచంలో జరిగిన అనేక ఉద్యమాలకు ముఖ్యంగా భారతదేశంలో జరిగిన స్వాతంత్ర పోరాటంలోనూ ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఇటీవల కాలంలో జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర

సాధన లోను కళలే వెన్ను దన్నుగా నిలిచాయని కవులు కళాకారులు రచయితల వల్లనే ప్రజా ఉద్యమాలు విజయవంతమయ్యాయన్నది చరిత్ర చెబుతున్న సత్యం అని అన్నారు

ముఖ్యంగా ప్రజానాట్యమండలి చరిత్ర మహోన్నతమైనదని కళ కళ కోసం కాదని కళకాసుల కోసం కాదని కళ ప్రజల కోసం అని ఎందరో మట్టిలో మాణిక్యాల లాంటి కళాకారులను వెలికి తీసి శిక్ష ఇచ్చి కళా సైనికులను తయారు చేసిన ఘనత ప్రజానాట్యమండలి ది అని దేశం కోసం సరిహద్దుల్లో పోరాడే సైనికుడికి ప్రజా నాట్యమండలి కళాకారుడు దేనిలోలు తీసిపోడని ఆయన అన్నారు ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజా కళాకారులు హాజరవుతారని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్దె శ్రీనివాస్ సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు

# రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలుగా రాయపూడి భవాని నియామకం....

నల్గొండ టౌన్, మే 19 (సూర్య సేన): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు,గా మిర్యాలగూడ చెందిన, రాయపూడి భవాని ని నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా మహాసభ నాయకులు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభాధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

నల్లగొండ జిల్లాకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర పదవిని ఇవ్వడం పట్ల వారు అమరావతిని అభినందించారు. రాయపూడి భవాని గత కొన్ని సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్య ప్రజలకు విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేసి మంచి సమర్థవంతమైన నాయకురాలుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఆర్యవైశ్యుల అభిమానం పొందిన రాయపూడి భవానికి రాష్ట్ర పదవి ఇవ్వడం సరైన నిర్ణయం అన్నారు.

అలాగే మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ్రాజ్యలక్ష్మి కోశాధికారి అలభట్ల శ్రీదేవి, అదనపు ప్రధాన కార్యదర్శి వాసా శ్రీదేవిలా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు, హర్షం వ్యక్తం చేసిన వారిలో, నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాసులు, కోశాధికారి జైని రాములు, అదనపు ప్రధాన కార్యదర్శి నాల్ల వెంకటేశ్వర్లు, మహాసభ మాజీ జిల్లా అధ్యక్షుడు



వనమా వెంకటేశ్వర్లు వాసవి క్లబ్ గవర్నర్ సతీష్ కుమార్, కోటగిరి రామకృష్ణ,జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గుండా నాగరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి సోమచంద్రశేఖర్ , ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, నాంపల్లి నరసింహ,జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు యమ దయాకర్, కార్పొరేటర్ యామా కవితా దయాకర్, కోటగిరి దైవాదినం, ఎల్ వి కుమార్, లకుమారపు శ్రీనివాసులు, పారేపల్లి శ్రీనివాస్, నల్లగొండ శ్రీనివాస్, యామ మురళి, బండారు వెంకటేశ్వర్లు , తదితరులు ఉన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు...



**సూర్యాపేట టౌన్, మే 19 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ ఎలుగురి ఇందిరా వీరయ్య గౌడ్ నివాసంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎలుగురి వెంకటేశం గౌడ్, మాజీ మూసి వైస్ చైర్మన్ కొప్పుల రామ్ రెడ్డి, మాజీ సహకార సంఘం బ్యాంకు డైరెక్టర్ కొణితం కృష్ణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, పట్టణ ఉపాధ్యక్షులు భైరు నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల బిక్షం రెడ్డి, నంద్యాల ప్రతాపరెడ్డి, ఎల్కక వెంకట్ రెడ్డి, జంగిలి



సైదులు, రేపాల దేవేందర్ రెడ్డి, ఎడ్ల ఉపేందర్, సింగం మహేష్, మాలే సుదర్శన్ రెడ్డి, నల్ల మేకల సైదులు, షేక్ లత్తు, షేక్ సొందు, ఉమర్ పాషా, నల్ల మేకల ఎల్లయ్య, మేకార బోయిన ఏడుకొండలు, తమ్మిశెట్టి నాగరాజు, పిండిగా విజయ్

కుమార్, గార్లపాటి వెంకట్ రెడ్డి, వెన్న ఉపేందర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు షేక్ రహీం, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, నామా మోహన్, మధు, షేక్ గౌస్ పాషా, పిల్లల నాగరాజు, ప్రదీప్, నూకల మనోజ్, రాచకొండ శివమణి, లింగ,తదితరులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.....



సూర్యాపేట, మే 19 (సూర్య సేన): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశమునకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు తేది. 22-5-2026 న జరుగు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశమును పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఆర్డీవోలు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ తో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మే, 22 న నిర్వహించు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, గృహ లక్ష్మీ పథకం, ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సన్న బియ్యం పంపిణీ వడ్డీ లేని రుణాలు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల పై సంబంధిత శాఖలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని, వాటికి సంబంధించిన ఫోటోలను ఎల్ఈడి స్క్రీన్ లపై డిస్ప్లే చేయించాలని అలాగే (99) రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో సంబంధిత శాఖలు వారి శాఖలో జరిగిన కార్యక్రమాలను కూడా వివరించాలని, సంక్షేమ శాఖలకు చెందిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేయాలని ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రిని స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను సర్పంచులను, పౌర సేవా సంస్థలను, స్థానిక సంస్థల ప్రతినిధులను ఆహ్వానించుటకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించి వారికి ఈ కార్యక్రమం యొక్క బాధ్యతలు అప్పగించాలని

ఈ కార్యక్రమాన్ని అందరూ అధికారులు కలిసికట్టుగా భాగస్వామ్యంతో పనిచేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా దిగ్విజయం చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శిరీష , సిపిఓ కిషన్, డిపిఓ యాదగిరి, డీఎస్ఓ మోహన్ బాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అగ్రికల్చర్ సూపర్డెంట్ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల పెంపు సామాన్యులపై భారమే

– ప్రభుత్వం వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలి :
గుగులోతు నీలాహేమ్లా నాయక్



**గరిడేపల్లి ప్రతినిధి, మే 19 (సూర్య సేన) :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుగులోతు నీలాహేమ్లా నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే వంటగ్యాస్ ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా తాజా ఇంధన ధరల పెంపు సామాన్యులకు మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. లారీ రవాణా ఖర్చులు పెరగడంతో మార్కెట్‌లో కూరగాయలు, ధాన్యాలు, పాలు, పండ్ల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ధరల పెరుగుదలతో మధ్యతరగతి, పేద కుటుంబాల జీవనం మరింత కష్టంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఇంధన ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.

# పోక్సో, అత్యాచారం కేసులో నేరస్తునికి 33 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా

– కేసు దర్యాప్తు, కోర్టు తీర్పు
వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ.

**సూర్యాపేట, మే 19 (సూర్య సేన) :** 2019 సంవత్సరం మే నెలలో పెనపహాడ్ పోలీస్ స్టేషన్ నందు నమోదైన పోక్సో, అత్యాచారం కేసులో నిందితుడైన పారపంగి అలెందర్ అనే వ్యక్తిని నేరస్తునిగా నిర్ధారించి 33 సంవత్సరాల జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తూ సూర్యాపేట ఫస్ట్ ఏడిజే కోర్టు ఇంచార్జ్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

నేరస్థుడు పెనపహాడ్ మండల పరిధి ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన ఘటనపై తల్లిదండ్రులు చేసిన పిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి బలమైన ఆధారాలు, సాక్షాలు నమోదు చేసి అప్పటి సూర్యాపేట డివిజన్ డిఎస్పీ నిందితుడిపై నేరాభియోగ పత్రాలను కోర్టుకు దాఖలు చేసినారు. కేసు వాదనలో భాగంగా సాక్షులను, బాధితులను విచారించి, ఆధారాలను పరిశీలించి నిందితుడు నేరానికి పాలడ్డాడు అని నిర్ధారించి 33 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగింది. ఈ కేసుకు సంబంధించి ఎప్పటికప్పుడు కోర్టు అధికారులతో ప్రస్తుత డిఎస్పి ప్రసన్నకుమార్ అధ్వర్యంలో సిఐ రాజశేఖర్, ఎస్ఐ గోపి కృష్ణ పర్యవేక్షణ చేసినారు. బాధితుల తరఫున పిపి రఘురామయ్య వాదనలు వినిపించారు. కోర్టులో సమన్వయంగా పని చేసినారు. సాక్షులను బాధితులను ప్రవేశపెట్టడంలో కోర్టు కానిస్టేబుల్ యాసిన్ పనిచేశారు,




పోలీసు భరోసా సెంటర్ సపోర్టు పర్సన్ జ్యోతి కేసులో బాగా పనిచేశారు, కోర్టు లైసెన్ ఆఫీసర్ శ్రీకాంత్ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నారు. కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో బాగా పనిచేసిన అధికారులందరినీ ఎస్పీ అభినందించారు.

# క్రీ॥శే॥ రణబోతు లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**పెన్‌పహాడ్, మే 19 (సూర్య సేన) :** పెన్‌పహాడ్ మండలంలోని చీదెళ్ళ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రణబోతు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి క్రీ॥శే॥ రణబోతు లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు , జిల్లా కార్యదర్శి నేరెళ్ళ మధు గౌడ్ , వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ , దొంతిరెడ్డి సైదిరెడ్డి గారు, చిలుముల గోపాల్ రెడ్డి , మర్ల కరుణాకర్ రెడ్డి , దండ అరవింద్ రెడ్డి , మారయ్య , ధరావత్ ధర్నా , ఎస్కే జోని , పెన్‌పహాడ్ మండల నాయకులు ముదిరెడ్డి రంగారెడ్డి , ముదిరెడ్డి ఎల్లారెడ్డి , యాట ఉపేందర్ , కుందూరు వెంకట్ రెడ్డి , అమృత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బుర్రకథ, ఒగ్గుకథలపై అవగాహన




– పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో కళాకారుల ప్రదర్శనలు

**నేరేడుచర్ల ప్రతినిధి, మే 19 (సూర్య సేన) :** పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్లలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భారతీయ సంప్రదాయ కళలైన ఒగ్గుకథ, బుర్రకథలపై ప్రముఖ బుర్రకథ, రంగస్థల కళాకారుడు, నంది అవార్డు గ్రహీత దొంతగాని వెంకటేశ్వర్లు బృందంచే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దొంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పూర్వం నుంచి ప్రజలను చైతన్య పరచడంలో బుర్రకథకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

కళాకారులు తమ హావభావాలు, రసజ్ఞతతో కథను ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ప్రదర్శిస్తారని తెలిపారు. నాటి బుర్రకథ కళాకారులు విశేష కీర్తి పొందారని, ప్రస్తుతం కళలకు పూర్వ వైభవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానం, మానసిక వికాసం కోసం విద్యార్థులు కళలను అభ్యసించాలని సూచించారు. అనంతరం బుర్రకథ కళాకారుడు దొంతగాని వెంకటేశ్వర్లును ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొనతం వెంకటరెడ్డి, కట్టా శ్రీనివాసరెడ్డి, పీడీ ఎం. యాదగిరి, డాన్స్ మాస్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కేంద్రాల నుండి మిల్లులకు పంపాలి...






**నల్గొండ /పీ.ఏ. పల్లి, మే 19 (సూర్య సేన) :** ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.

మంగళవారం ఆయన పి.ఏ.పల్లి మండలం అంగడిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, తరలింపు ప్రక్రియపై సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ ఇంకా ఎంత ధాన్యం మిగిలి ఉందని ?ధాన్యం తరలింపులో ఎందుకు జాప్యం జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేసేందుకు అవసరమైన లారీలు, హమాలీల లాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు,

తరలింపు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తహసిల్దార్ జయశ్రీ,ఏవో పాండు, సీఈఓ ప్రభాకర్, సర్పంచ్ చిరంజీవి నాయక్ ,సెంటర్ నిర్వాహకులు మహేష్, తదితరులు వెంట ఉన్నారు .

# కీ.శే. ఎలిమినేటి పుష్పలత పార్థీవదేహానికి నివాళులర్పించిన టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్



**సూర్యాపేట టౌన్, మే 19 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణంలోని 30వ వార్డులో సీనియర్ నాయకులు ఎలిమినేటి అజయ్ కుమార్ సతీమణి, కీ.శే. ఎలిమినేటి పుష్పలత పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మీ అక్బర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వర్రీ కవిత, సూపర్ సైదులు, లింగాల సైదులు, కర్నాటి శ్రీను, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు, ప్రజలను వేధిస్తే చర్యలు

– హిజ్రాలకు సీఐ చరమంద రాజు హెచ్చరిక

**హుజూర్‌నగర్ ప్రతినిధి, మే 19 (సూర్య సేన) :** హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు ఆదేశాల మేరకు మంగళవారం ఎస్సై సీహెచ్ నరేశ్ హుజూర్‌నగర్ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ ఇకముందు హిజ్రాలు రహదారులపై వాహనదారులను ఆపి డబ్బులు వసూలు చేయడం, గృహప్రవేశాలు, పెళ్లిళ్లు తదితర శుభకార్యాల సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయరాదని హెచ్చరించారు.



ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎవరైనా హిజ్రాలు డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి...!



**హుజూర్నగర్ ప్రతినిధి, మే 19 (సూర్య సేన) :** తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మేళ్లచెరువు మండలంలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు మేళ్లచెరువు మండలం వెల్లటూరు కాలనీకి చెందిన దాసు సైదులు (46) ఈ నెల 12న చింతలపాలెం మండల కేంద్రంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారడంతో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డారు.

కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం (ఈ నెల 19న) సైదులు మృతి చెందారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లోకల్ పోరుకు వ్యూహాలు

**విజయవాడ, మే 19 (సూర్య సేన) :** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు.మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలి ఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది.ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందుతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు. తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది.ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందుకే అన్ని పార్టీలు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని నేతల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని నిర్ణయించాయి. విభేదాల ఫలితం ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడకూడదని, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్ ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేసుకుని నేతల మధ్య, క్యాడర్ లో నెలకొన్న విభేదాలు తొలగించే ప్రయత్నాలు చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకత్వంలో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలు కొంత అలజడికి కారణమయ్యాయి.

# చంద్రబాబు.. లోకేష్... దేవాన్ష్

**విజయవాడ, మే 19 (సూర్య సేన) :** చంద్రబాబు కుటుంబంలో ఏది జరిగిన ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణే. ఇప్పటివరకు చంద్రబాబు.. తరువాత లోకేష్.. ఇప్పుడు దేవాన్ష్ అన్నట్టు పరిస్థితి మారింది. చదువుతో పాటు ఇతరత్రా అంశాల్లో సైతం ముందున్నారు దేవాన్ష్. మొన్నటి వరకు చదరంగంలో సైతం సత్తా చాటారు. ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొని నైపుణ్యం కనబరిచారు. ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు దేవాన్ష్. ఓ యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. పురాతన జంతువులతో పాటు అంశాలను తనదైన శైలిలో వివరించేందుకు సిద్ధపడ్డారు. యూట్యూబ్ ఛానల్ పరిచయ కార్యక్రమంలో భాగంగా కుమారుడు దేవాన్ష్‌తో పాటు లోకేష్ పాలుపంచుకున్నారు. ప్రోమో వీడియోలో లోకేష్ సైతం కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.నారాతోపాటు నందమూరి కుటుంబానికి సైతం దేవాన్ష్ స్పెషల్. నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణిని లోకేష్ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు పెద్ద మనవడు దేవాన్ష్. బాలకృష్ణకు ఏకైక కుమారుడు లోకేష్ కావడంతో.. దేవాన్ష్ సైతం ఏకైక కుమారుడు లోకేష్ దంపతులకు. అయితే చిన్ననాటి నుంచి నానమ్మ భువనేశ్వరి పర్యవేక్షణలోనే పెరుగుతున్నాడు. ఏటా సంక్రాంతి వేడుకల సమయంలో నారావారిపల్లిలో సైతం దేవాన్ష్ సందడి చేస్తుంటాడు. గ్రామానికి వెళ్ళిన క్రమంలో తోటి చిన్నారులతో ఆటలాడుతుంటాడు. కర్ర సాములో సైతం ప్రావీణ్యం పొందాడు. ముఖ్యంగా చెస్ లో రాణిస్తూ వచ్చాడు. ప్రపంచ స్థాయి పోటీల్లో సైతం పాల్గొంటూ వచ్చాడు. ఇప్పుడు కేవలం పరిశోధనాత్మకమైన, ప్రాచీనమైన డైనోసార్లు, ఇతరత్రా జంతువుల గురించి తనకు తెలిసిన విషయాన్ని పంచుకునేందుకు డినోడిట్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్లో అందుబాటులోకి వస్తున్నాడు.కచ్చితంగా ఒక ముఖ్యమంత్రి మనవడు, ఒక మంత్రి కుమారుడు, ప్రముఖ హీరో మనవడు, సెలబ్రిటీ హోదాలో ఇప్పుడు దేవాన్ష్ యూట్యూబ్ ద్వారా పరిచయం అవుతుండడం మాత్రం గొప్ప విషయం. ఎందుకంటే ఆయన ఎంచుకునేందుకు సినిమా రంగంతో పాటు రాజకీయరంగం ఎలానూ ఉంది. ఒక పద్ధతి ప్రకారం దేవాన్ష్ విషయంలో అడుగులు వేస్తోంది నారా కుటుంబం. ఈ ప్రత్యేక యూట్యూబ్ ఛానల్స్ కు లక్షల్లో



అప్పుడే వ్యూయర్ షిప్ వస్తోంది. మున్ముందు కచ్చితంగా ఇది సంచలనాలకు వేదిక కానుంది. ఎక్కువమంది నారా దేవాన్ష్ కు శుభాకాంక్షలు చెబుతున్నారు.దేవాన్ష్ ఒక యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించాడు. రాక్షస బల్లులు, శిలాజాలు, పురాతన అవశేషాల గురించి కొంతకాలంగా దేవాన్ష్ పరిశోధన చేస్తున్నాడు. వివిధ పుస్తకాలలో ప్రచురితమైన అంశాలను క్రోడీకరించి.. తాను తెలుసుకున్న విషయాలను.. ఆశ్చర్యానికి గురిచేసే అంశాలను.. ఆకట్టుకునే విధంగా రూపొందించాడు. ఈకాలపు పిల్లలకు అర్థమయ్యే విధంగా వాటిని రూపొందించాడు. వీటిని పాడ్ కాస్ట్ రూపంలో తన యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేయబోతున్నాడు.సాధారణ యూట్యూబ్ ఛానల్ మాదిరిగా కాకుండా.. దానికోసం ఒక డైనోసార్ ప్రపంచాన్ని సృష్టించాడు దేవాన్ష్. ప్రాచీన ప్రపంచంలోకి ప్రేక్షకుడి లాగా తన తండ్రిని ఆహ్వానించాడు. దీనిపై అనేక ప్రశ్నలు నారా లోకేష్ అడిగితే.. దేవాన్ష్ ఏ మాత్రం తడుముకోకుండా సమాధానం చెప్పాడు. ఇదే విషయాన్ని నారా లోకేష్ సోషల్ మీడియాలో ప్రస్తావించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.నారా దేవాన్ష్ కొంతకాలంగా శిలాజాలు.. పురాతన సంఘటనలు.. వందల సంవత్సరాల క్రితం జీవించిన జంతువులు.. వంటి వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాను తెలుసుకున్న విషయాలను.. పాడ్ కాస్ట్ రూపంలో చెప్పడానికి నారా దేవాన్ష్ ప్రయత్నిస్తున్నారు. నారా లోకేష్ ప్రోమో వీడియో రిలీజ్ చేయడంతో.. నారా దేవాన్ష్ యూట్యూబ్ ఛానల్ మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి.

# కమలంపై పసుపు గుర్రు....

**విశాఖపట్టణం మే 19 (సూర్య సేన) :** ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తోంది తెలుగుదేశం. కేంద్ర ప్రభుత్వంలో సైతం కీలక భాగస్వామి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల తో పాటు రాజకీయ ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి పెద్ద పీట వేస్తోంది కేంద్రం. అయితే అదే స్థాయిలో ఏపీ నుంచి బిజెపి ప్రాతినిధ్యం కోరడం తెలుగుదేశం పార్టీకి లోటు. తాజాగా రాజ్యసభ పదవులకు సంబంధించిన ఎంపిక విషయంలో బిజెపి పట్టుబడుతుండడంతో టిడిపి సీనియర్లు మదన పడుతున్నారు. మరోసారి ఏపీ నుంచి రాజ్యసభ పదవి కోరుతోంది బిజెపి. కానీ ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఎన్ని రోజులపాటు పార్టీ కోసం కష్టపడితే.. తమకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని.. తమకు వచ్చే అవకాశాలను బిజెపి తన్నుకుపోతోందని ఆవేదనతో ఉన్నారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. టిడిపి సీనియర్లు చాలామంది పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలో రెండుసార్లు రాజ్యసభ, అదే స్థాయిలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ జరిగింది.



# అత్యంత పేలవ కరెన్సీ రూపాయి....

న్యూఢిల్లీ : ఆసియాలోనే అత్యంత పేలవ కరెన్సీగా రూపాయి నమోదయ్యింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అత్యధికంగా పడిపోయిన కరెన్సీగా చోటు చేసుకోవడం ఆందోళనకరం. ఇరాన్-యుఎస్ యుద్ధం, విపరీతంగా పెరిగిన ముడి చమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల ఉపసంహరణ, విదేశీ మారకద్రవ్య నిల్వలు క్షీణించడం వంటి కారణాల వల్ల శుక్రవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి రికార్డు స్థాయిలో 96 మార్క్‌కు పడిపోయింది. 2026 లోనే దాదాపు 6 శాతం పతనమైంది. భారత్ కంటే చిన్న దేశాలైనా మలేషియన్ రింగ్గిట్ విలువ 3.3 శాతం, సింగపూర్ డాలర్ 1 శాతం చొప్పున పెరిగాయి. పొరుగు దేశం చైనా యువాన్ ఏకంగా 2.9 శాతం బలపడింది. తైవాన్ డాలర్ 0.3 శాతం, హాంకాంగ్ డాలర్ 0.6 శాతం, జపనీస్ యెన్ 0.7 శాతం చొప్పున స్వలంగా తగ్గాయి. వీటితో పోల్చితే భారత కరెన్సీ తీవ్ర పతనాన్ని చవి చూడటం మోడీ పాలనలో విఫలాన్ని స్పష్టం చేస్తోంది. ఈ కరెన్సీ పతనం దేశీయంగా ఇంధన సంక్షోభానికి దారితీసి, సామాన్యులపై భారీ ద్రవ్యోల్బణ ముప్పును తెచ్చిపెట్టింది. ముడి చమురు, ఇతర నిత్యావసరాల దిగుమతి ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రాబోయే రోజుల్లో రవాణా భారమై, మార్కెట్లలో వస్తువుల ధరలు మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది. 100కు పడొచ్చు..పశ్చిమ ఆసియా సంక్షోభం ఇలాగే సుదీర్ఘకాలం కొనసాగితే రూపాయి విలువ మున్ముందు మరింత క్షీణించి, సైకలాజికల్ మార్క్ అయిన 100 స్థాయిని తాకవచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ రీసెర్చ్ నివేదిక హెచ్చరిస్తోంది. పశ్చిమాసియా వివాదానికి తగిన పరిష్కారం లభించే వరకు పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తిగా భావించే యుఎస్ డాలర్ వైపే మొగ్గు చూపుతారని, దీనివల్ల డాలర్ మరింత బలపడి భారత ఆర్థిక వ్యవస్థ, విదేశీ వాణిజ్య సమతుల్యతపై ఒత్తిడి పెరగొచ్చని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రూపాయి పతనం అనేది కేవలం పెద్ద ఆర్థిక సంక్షోభంలా అనిపించినప్పటికీ, ఇది సామాన్య ప్రజల రోజువారీ బడ్జెట్‌ను నేరుగా దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. గత ఏడాది కాలంలో రూపాయి దాదాపు 11 శాతంగా పడిపోగా.. అందులో 5 శాతం మేర పతనం కేవలం ఇరాన్ వివాదం ప్రారంభమైన తర్వాతే సంభవించడం గమనార్హం.?రవాణా ఖర్చులు తడిసి మోపెడుభారత్ తన చమురు అవసరాల కోసం దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ఇటీవల ఇంధన ధరలను లీటరుకు రూ. 3 చొప్పున పెంచడం ఈ ఒత్తిడికి నిదర్శనం. ఇంధన ధరలు పెరగడం వల్ల ట్రక్కులు, రవాణా వాహనాల నిర్వహణ ఖర్చులు పెరిగి మార్కెట్లలో కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆటోమేటిక్‌గా పెరిగిపోతాయి. అదే విధంగా చమురుతో పాటు దేశం తన గ్యాస్ అవసరాలలో 51 శాతం దిగుమతి చేసుకుంటున్నందున ఈ ఒత్తిడి మరింత తీవ్ర రూపం దాల్చుతోంది.?బంగారం ధరలు చుక్కలే..రూపాయి పతనం వల్ల దేశీయంగా బంగారం దిగుమతి ఖర్చు గణనీయంగా పెరుగుతుంది. ఇది దేశీయ మార్కెట్లలో బంగారం ధరలను మరింత ఆకాశానికి చేరుస్తుంది. రూపాయి బలహీనపడినప్పుడు విదేశాల నుండి వచ్చే ముడిసరుకులు, విడిభాగాలు, ఇతర వస్తువుల ధరలు పెరుగుతాయి. అధిక ఉత్పత్తి ఖర్చులను ఎదుర్కొనే కంపెనీలు ఆ భారాన్ని ఉత్పత్తులు, సేవల ధరలను పెంచడం ద్వారా వినియోగదారులపై బదిలీ చేస్తాయి. ఫలితంగా కుటుంబాల కొనుగోలు శక్తి తగ్గి.. కాలక్రమేణా సామాన్యుడి రోజువారీ జీవితం అత్యంత ఖరీదైనదిగా మారుతుంది.



## వెండి దిగుమతులపై ఆంక్షలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం




న్యూఢిల్లీ : బంగారంపై ఇటీవల కస్టమ్స్ డ్యూటీని భారీగా పెంచిన కేంద్ర ప్రభుత్వం శనివారం వెండి దిగుమతులపై అదనపు ఆంక్షలు విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మే 13న పసిడి లోహాలపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుండి ఏకంగా 15 శాతానికి పెంచిన ప్రభుత్వం.. ఈ సుంకాలను వెండిపైనా అమల్లోకి తెస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) శనివారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజా ఆంక్షల ప్రకారం..

విదేశాల నుండి వెండిని దిగుమతి చేసుకోవాలనుకునే వ్యాపారులు లేదా సంస్థలు ఇకపై కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక లైసెన్స్ లేదా అనుమతిని పొందడం తప్పనిసరి అవుతుంది. దేశంలో పెరుగుతున్న దిగుమతి ఖర్చులను అదుపు చేయడానికి, విదేశీ మారకద్రవ్య నిల్వలపై ఒత్తిడిని తగ్గించడానికి, వాణిజ్య లోటును అరికట్టడానికి ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి.

## సిప్ చేసేస్తున్నారు



**హైదరాబాద్ :** భారతీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) ఏప్రిల్ చివరి నాటికి రూ.81.92 లక్షల కోట్లకు చేరుకుంది. పెట్టుబడిదారుల నుంచి వస్తున్న స్పందన, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్), ఈక్విటీ ఫండ్లలోకి వస్తున్న నిరంతర పెట్టుబడులు ఈ వృద్ధికి ప్రధాన కారణమని భారతీయ మ్యూచవల్ ఫండ్ల సంఘం (యాంఫీ) వెల్లడించింది. ఈ మేరకు సోమవారం గణాంకాలను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చిలో రూ.73,73,376.98 కోట్లుగా ఉన్న ఏయూఎం ఏప్రిల్ చివరి నాటికి రూ.81,92,387.69 కోట్లకు చేరుకుంది. కేవలం ఒక నెల వ్యవధిలోనే 11.2 శాతం వృద్ధి నమోదైంది. మార్కెట్లో ఉన్న మొత్తం మదుపరుల సంఖ్య 27.53 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లోనే కొత్తగా 13.77 లక్షల ఖాతాలు జతయ్యాయి. ఇందులో కేవలం రిటైల్ పెట్టుబడిదారుల (ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియంటెడ్ పథకాలు) ఖాతాల సంఖ్యే 21 కోట్లకు పైగా ఉంది. వీరి పెట్టుబడుల విలువ రూ.47,41,872 కోట్లుగా ఉన్నాయి. ఈక్విటీ ఫండ్లపై మదుపరుల ఆసక్తి స్థిరంగా కొనసాగుతూనే ఉంది. ఈక్విటీ ఫండ్లలోకి మార్చి 2021 నుంచి సానుకూల పెట్టుబడులు వరుసగా 62వ నెలకు చేరుకున్నాయని యాంఫీ వెల్లడించింది. ఏప్రిల్‌లో ఈక్విటీ విభాగంలోకి రూ.38,440.20 కోట్ల మేరకు నికర పెట్టుబడులు వచ్చాయి. ఈ విభాగంలో ఫ్లెక్సీ క్యాప్ రూ.10,147.85 కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్లు రూ.6,885.90 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్లు రూ.6,551.40 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డెట్ ఫండ్లలోకి..

డెట్ ఫండ్లలోకి సైతం ఏప్రిల్‌లో రూ.2,47,490.03 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. ఇందులో అధికభాగం లిక్విడ్ ఫండ్లు సొంతం చేసుకోగా, ఆ ఒక్క విభాగంలోకే అత్యధికంగా రూ.1,65,104.67 కోట్లు వచ్చాయి. మరోవైపు హైబ్రిడ్ ఫండ్లు ద్వారా రూ.20,565.24 కోట్లు రాగా, అందులో సగానికిపైగా ఆర్బిట్రేజ్ ఫండ్ల ద్వారానే సమకూరాయి. ఇండెక్స్ ఫండ్లు, ఈటీఎఫ్‌లతో కూడిన ఇతర పథకాల విభాగంలోనూ రూ.20,082 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. సిప్‌లో.. గత నెలలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా రూ.31,115.41 కోట్ల పెట్టుబడులు మార్కెట్లోకి వచ్చాయి. సిప్ నికర ఆస్తుల విలువ రూ.16,85,126.19 కోట్లకు చేరింది.

## ప్రారంభ స్థాయి ఉద్యోగుల స్థానంలో ఏఐఅంతర్జాతీయంగా సగం మంది సీఈఓల ధోరణి ఇది



**ఆలివర్ వైమాన్- న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నివేదిక**

కంపెనీల్లో సాధారణ కార్యకలాపాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత టూల్స్ పూర్తి చేస్తుండటంతో, ప్రారంభ స్థాయి ఉద్యోగ నియామకాలు తగ్గిపోతున్నాయి. కంపెనీల నియామకాలవిధానంలో భారీ మార్పులకు ఇది కారణమవుతోంది. ఆలివర్ వైమాన్ ఫోరమ్, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించిన అంతర్జాతీయ సర్వే ప్రకారం.. 'తాజా ఉత్తీర్ణులను తీసుకోవడం తగ్గించి, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నియామకాలపై దృష్టి పెట్టాలని' ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం మంది సీఈఓలు యోచిస్తున్నారు. పలు రంగాల పరిశ్రమలు, ప్రాంతాలకు చెందిన 415 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా, 2026 సీఈఓ సర్వే నివేదికను రూపొందించారు. దీని ప్రకారం 43% మంది సీఈఓలు రాబోయే రెండేళ్లలో జూనియర్ స్థాయి కొలువులను తగ్గించాలని భావిస్తున్నారు. 2025లో ఇలా భావించిన వారి సంఖ్య 17 శాతంగా ఉంది. 33% మంది సీఈఓలు మధ్య స్థాయి ఉద్యోగాల భర్తీపై ఎక్కువ దృష్టి పెడుతుండగా, 10% మంది సీనియర్ ఉద్యోగుల నియామకానికి మొగ్గుచూపుతున్నారు. సాధారణ పనులంటేఫ్రెషర్లు, జూనియర్ ఉద్యోగులకు ఇచ్చే రొటీన్ పనులను, కంపెనీలు ఏఐ టూల్స్ సాయంతో నిర్వహించగలుగుతున్నాయి. కోడింగ్ రాయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం నుంచి కస్టమర్ సపోర్ట్, నివేదికను రూపొందించడం వంటి పనుల కోసం ఇప్పుడు ఏఐను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

నిర్ణయాలు తీసుకోవాల్సింది ఉద్యోగులేనిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మక ఆలోచనలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో ఏఐ ఇంకా సఫలం కావడం లేదు.

## 2026--27లో 6.6 శాతం వృద్ధి




న్యూఢిల్లీ: దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026--27) 6.6 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని ఎస్‌బీఐ అధ్యయన విభాగం నివేదిక అంచనా వేసింది. రూపాయి విలువ క్షీణిస్తుండడం, అధిక ముడి చమురు ధరల నేపథ్యంలో బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్స్ (బీవోపీ/క్యాడ్)కు సంబంధించి ప్యాకేజీ అవసరమని పేర్కొంది. రూపాయి ఇటీవలి కాలంలో గణనీయంగా నష్టపోవడం తెలిసిందే. డాలర్‌తో 95 స్థాయి కంటే దిగువకు పడిపోయింది. "బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు మించిపోవడంతో.. రవాణా, బీమా ఖర్చులు పెరిగిపోయాయి. కనుక బీవోపీ పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు అవసరం. డాలర్‌తో రూపాయి 95 స్థాయిలోనే కొనసాగితే ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4.04 ట్రిలియన్ డాలర్లకు పడిపోతుంది. దీంతో 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలన్న స్వప్నం 2029--30లోనే సాధ్యపడుతుంది"అని ఈ నివేదిక తెలిపింది. రూపాయి వేగంగా విలువను కోల్పోతుండడానికి తోడు తీవ్ర ఆటుపోట్లు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. 2025--26 చివరి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతంగా ఉండొచ్చని, 2025--26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7.5 శాతం వద్ద ఉండొచ్చని అంచనా వేసింది. వృద్ధి 6 శాతమే: హెచ్ఎస్‌బీసీ ఇంధన ధరల పెరుగుదల/సరఫరా సంక్షోభానికి తోడు, ఎల్‌నినోతో వర్షపాతం తక్కువగా ఉండొచ్చన్న అంచనాలు, ద్రవ్యలోటు పెరిగే పరిస్థితులతో భారత్ జీడీపీ వృద్ధి 2026--27లో 6 శాతానికి పరిమితం కావొచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ హెచ్ఎస్‌బీసీ తెలిపింది. ఈ పరిస్థితులతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని.. ఫలితంగా ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రేట్లను రెండు సార్లు (వచ్చే డిసెంబర్, మార్చి సమీక్షల్లో) పెంచొచ్చని అంచనా వేసింది. ప్రస్తుత సంక్షోభం సంఘటిత రంగం, చిన్న సంస్థలు, గ్రామీణ గృహాలపై భారం మోపుతుందని హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతలతో సాగు కార్యకలాపాలపై ప్రభావం పడుతుందని పేర్కొంది. 2026--27లో ద్రవ్యోల్బణం 5.6 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది. రెండు త్రైమాసికాల్లో 6 శాతాన్ని మించొచ్చని పేర్కొంది. చమురు మార్కెటింగ్ సంస్థలపై భారం తగ్గించేందుకు పెట్రోల్ లీటర్‌పై రూ.7 వరకు పెంచొచ్చని అంచనా వేసింది. పెంపు లేకపోతే మాత్రం అప్పుడు ద్రవ్యోల్బణం 5.3 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది. నివేదిక అంచనా వేసింది. రూపాయి విలువ క్షీణిస్తుండడం, అధిక ముడి చమురు ధరల నేపథ్యంలో బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్స్ (బీవోపీ/క్యాడ్)కు సంబంధించి ప్యాకేజీ అవసరమని పేర్కొంది. రూపాయి ఇటీవలి కాలంలో గణనీయంగా నష్టపోవడం తెలిసిందే. డాలర్‌తో 95 స్థాయి కంటే దిగువకు పడిపోయింది. "బ్రెంట్ చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు మించిపోవడంతో.. రవాణా, బీమా ఖర్చులు పెరిగిపోయాయి.

## దేశీయ తయారీ ఐఏఎఫ్ సీ-295 సిద్ధంటాటా-ఎయిర్‌బస్ సంయుక్త తయారీ



సీ-295 విమానం వద్ద అధికారుల బృందం

భారత రక్షణ రంగ తయారీలో మరో కీలక ముందడుగు పడింది. దేశీయంగా అసెంబుల్ చేసిన సైనిక రవాణా వాహనం ఎయిర్‌బస్ సీ-295 విమానం ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమైంది. గుజరాత్ వడోదరాలోని టాటా- ఎయిర్‌బస్ ప్లాంట్‌లో ఈ విమానాన్ని రూపొందించారు. 'భారత్‌లో తయారీ' కార్యక్రమంలో ఈ ప్రాజెక్టు కీలకం. తద్వారా సీ-295 ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుగా భారత్ అవతరించింది. భాగంగా, 2024 అక్టోబరు 28న వడోదరా ప్లాంట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు.

## సామాన్యుడిపై ధరల మోత: ఇంటి బడ్జెట్ మరింత భారం!


**మళ్లీ ధరల పిడుగు!**

పెరుగనున్న సబ్బులు, డిటర్జెంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలు
మరో దఫా రేట్ల పెంపునకు ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు సిద్ధం
ఇంధనం, ప్యాకేజింగ్ వ్యయంభారీగా పెరుగడమే కారణం
ఇప్పటికే కమర్షియల్ ఎల్పీజీ ధర పెంపుతో సామాన్యుడు కుదేలు..
త్వరలో పెట్రో ధరల బాదుడు

న్యూఢిల్లీ: 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు' అన్నట్టు ఉంది దేశంలో ప్రస్తుతం పరిస్థితి. ఇప్పటికే మండుతున్న ధరలతో అల్లాడిపోతున్న సామాన్యుడిపై మరో పిడుగు పడనుంది. మళ్లీ ధరలు పెంచేందుకు ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) కంపెనీలు సిద్ధమవుతున్నాయి.దీంతో సబ్బులు, డిటర్జంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ వంటి నిత్యావసరాల ధరలు మరింత పెరుగనున్నాయి. ముడి చమురు ధరలతో సంబంధం ఉన్న ద్రవ్యోల్బణం, ప్యాకేజింగ్, ఇంధన వ్యయం పెరగడం, భౌగోళిక-రాజకీయ అస్థిరతల కారణంగా ధరలు పెంచక తప్పడం లేదని ఎఫ్ఎమ్‌సీజీ తయారీ సంస్థలు పేర్కొన్నాయి. ఇటీవలే పలు ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు 3-5 శాతం మేర రేట్లను పెంచాయి. తాజాగా రూ.10, 15 ప్యాకెట్ల ధరలను మినహాయించి మిగతా వాటి ధరలను పెంచడమో లేదా పరిమాణాన్ని తగ్గించడమో చేయాలని అవి భావిస్తున్నాయి.

ధరల పెంపునకు సిద్ధం..

రాయితీలు, ప్రచార ఖర్చును తగ్గించడం, సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించడం, అంతర్గత వ్యయం పరిమితి తగ్గించడంపై దృష్టి సారిస్తున్నప్పటికీ వినియోగదారులు కొంత భారాన్ని మోయాల్సి ఉంటుందని కంపెనీలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను నాలుగు శాతం పెంచినట్టు డాబర్ ఇండియా తెలిపింది. త్వరలో తమ ఉత్పత్తుల ధరలను 20 శాతం మేర



పెంచుతామని బ్రిటానియా కంపెనీ వెల్లడించింది. తమపై ఒత్తిడి పెరిగితే తమ సబ్బులు, డిటర్జెంట్ల ధరలు పెంచక తప్పదని హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ పేర్కొన్నది. ముడి చమురుతో ముడిపడి ఉన్న సరఫరా వ్యవస్థ దెబ్బ తినడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి అని ఆ కంపెనీ సీఎఫ్‌వో నిరంజన్ గుప్తా తెలిపారు. ఇదే సమయంలో కరెన్సీ విలువ నిరంతరం క్షీణించడం వల్ల ఉత్పత్తి వ్యయాలు మరింత పెరిగాయని పేర్కొన్నారు.ఫెవికాల్ తదితర ఉత్పత్తులను తయారు చేసే పిడిలైట్ ఇండస్ట్రీస్ కూడా మరోసారి ధరల పెంపుదలకు సిద్ధమవుతున్నది. పారాచూట్, సఫోలా బ్రాండ్ల ద్వారా కొబ్బరి నూనె, వంట నూనెలను అమ్మే మారికో సంస్థ ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను 6-7 శాతం పెంచింది.

ప్రస్తుతానికి ధరలను అలాగే ఉంచడంపై ఆ కంపెనీ దృష్టి సారిస్తున్నది. తాజా పరిస్థితిపై నెస్లే ఇండియా చైర్మన్ మనీశ్ తివారీ మాట్లాడుతూ...'రానున్న రెండు నెలల్లో ఏం జరుగబోతున్నదో ఎవరూ కచ్చితంగా అంచనా వేయలేనంత క్లిష్టంగా పరిస్థితి ఉన్నది.



## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రెసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.
ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.
ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు.
అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్ట్రాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

## జూన్‌లో మల్టీస్టారర్ షురూ




ఈ ఏడాది 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ విజయోత్సాహంలో ఆయన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్ కలిసి నటించనున్న ఈ మల్టీస్టారర్ జూన్ నెలలో సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. షైన్‌స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన హాస్యం, యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇందులో ఓ కథానాయికగా కీర్తి సురేష్‌ను ఖరారు చేశారని, మరో నాయిక కోసం చిత్రబృందం అన్వేషణలో ఉందని సమాచారం. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నారు వెంకటేష్. చిత్రీకరణ జరుగుతున్నది. ఇది పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి మల్టీస్టారర్‌లో వెంకటేష్ జాయిన్ కానున్నారు. ఈ సినిమాను కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

## మెగా 158 షూటింగ్!




మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నారని తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

## శ్రీలీలకు వరుస ఫ్లాపులు..?



టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల,చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా,ఆమె నటించినచాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవ డం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమా లో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్ర సీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం.

## అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్‌ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.
నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు.

## ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్స్ లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్‌తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE,
PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com